UESI
ANDHRA PRADESH

Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 30 - No.1

November 2023



“యెహోవా దూత పరలోకము నుండి అబ్రహామా అబ్రహామా... ఆ చిన్న వానిమీద చెయ్యి వేయకుము, అతని నేమియు చేయకుము, నీకు ఒక్కడైయున్న నీ కుమారుని నాకియ్య వెనుతీయలేదు గనుక నీవు **దేవునికి భయపడువాడవని** యిందువలన నాకు కనబడుచున్నదనెను”.

ఆది 22:11,12



## దేవుని భయం

# దేవుని భయంలేకపోతే...

**ఎడిటోరియల్**

హంగరీ రాజైన లూయిస్‌కు దైవభీతి ఎక్కువ. చిన్న తప్పు చేయాలన్నా భయపడేవాడు. అతని తమ్ముడైన ఫిలిప్ మాత్రం విచ్చలవిడి జీవితానికి అల వాటుపడి, దేవునికి అంత భయపడాలా? అంటూ అన్నను వెక్కిరించేవాడు. ఆ రోజుల్లో అర్ధరాత్రి ఎవరి ఇంటి ముందైనా తలారి (ఉరితీసే వ్యక్తి) బాకా మోగిస్తే, ఆ ఇంటి యజమానికి రాజుగారు ఉరిశిక్ష విధించారని అర్థం. అందుకే అర్ధరాత్రి బాకానాదానికి ప్రజలంతా భయపడేవాళ్ళు. ఒకరాత్రి ఫిలిప్ ఇంటిముందు బాకా మోగింది. అంతే! ఫిలిప్ భయంతో కుప్పకూలి, పిచ్చిపట్టినట్లు బిగ్గరగా ఏడ్వసాగాడు. తలారి అతనిని ఉరికంబం ఎక్కిస్తే ఎదురుగా ఉన్న లూయిస్ రాజు 'తలారి బాకా నాదానికే నువ్వంత భయపడితే, దేవదేవుని తీర్పుకు ఎదుర్కోవడానికి మరెంత భయపడాలి?' అని ప్రశ్నించి, ఇకనుంచి జాగ్రత్తగా ఉండమని అతనిని మందలించి ఇంటికి పంపేశాడు.

ఇశ్రాయేలీయులను, దేవుడు 430 సంవత్సరాల ఐగుప్తు బానిసత్వం నుంచి విడిపించి, మోషే నాయకత్వంలో వాగ్దాన భూమికి నడిపిస్తున్న సందర్భములో, మోషే మరణించిన తర్వాత, ఆ నాయకత్వ బాధ్యతలను యెహోషువాకు దేవుడు అప్పగించారు. నాయకుడైన యెహోషువా యెరికో పట్టణం పట్టుకోకముందే ఇశ్రాయేలీయులకు ఏం చేయాలి? ఏం చేయకూడదు? అనే దాని విషయమై స్పష్టమైన హెచ్చరికలు చేశాడు (యెహోషువ 6: 17,18,26). యూదా గోత్రానికి చెందిన, కర్మీ కుమారుడైన ఆకాను అనే సైనికుడు దేవుని భయం లేకుండా జీవించాడు. దేవుని భయం లేని వారి లక్షణాలు ఇలా ఉంటాయి.

*దేవుని మాటకు భయపడకుండా తేలిగ్గా తీసుకొన్నాడు (యెహోషువ 6:17-18; 7:15,20):* ఈ పట్టణమును దీనిలో నున్నది యావత్తును యెహోవా వలన శపింప బడెను.... శపింపబడిన దానిలో కొంచెమైనను మీరు తీసికొనిన యెడల మీరు శాపగ్రస్తులై, ఇశ్రాయేలీయుల పాళెమునకు శాపము తెప్పించి, దానికి బాధ కలు గజేయుదురు గనుక శపింపబడిన దానిని మీరు ముట్టకూడదు (6:17-18) అని యెహోషువ యెరి కోను జయించడానికి ముందు ఇశ్రాయేలీయులతో చెబుతాడు. అయితే ఆకాను ఈ మాటలను తేలిగ్గా తీసుకొని యెహోవా నిబంధనను మీరి ఇశ్రాయేలీయుల్లో దుష్కార్యం చేసినవాడయ్యాడు (7:15,20).

*లోకం దృష్టి పెట్టే వాటిమీద దృష్టి ఉంచాడు (7:21):* యెహోషువ, ఇశ్రాయేలీయులు యెరికోను జయించాలనే గురి కలిగి ఉంటే, ఆకాను మనస్సు, దృష్టి మాత్రం దానికి భిన్నంగా మంచి షీనారు వస్త్రం, బంగారం, వెండిపై ఉంది. లోకానుసారమైన మనసుగల వారు ఈ లోకం దృష్టి ఉంచేవాటి మీద ప్రాధాన్యత కలిగి ఉంటారు. ఆత్మానుసారులు ఆత్మసంబంధమైన విషయాలమీద మనసు ఉంచుతారు.

*రహస్యంగా పాపం చేయడానికి ఇష్టపడ్డాడు (7:1,2, 19,21):* "నేను చూశాను, నేను ఆశించాను, నేను తీసుకొన్నాను, నేను దాచాను" అని అతడు చెప్పాడు. ఇవి శోధనలో నాలుగు మెట్లు. మనము కూడా అలాగే రహస్యంగా పాపము చేస్తాము. ఆ తర్వాత మన పాపాన్ని కప్పి పెడతాము. "ఈ లోకంలో మనం రహస్యంగా చేసే పాపం పరలోకంలో బహిరంగ కుంభకోణంలా కనబడుతుందని" ఛాపర్ అనే భక్తుడు అంటాడు. ఇశ్రాయేలీయులు హాయిమీదకు వెళ్ళి ఓడిపోయి, దేవుడు కలుగజేసుకొంటేనే గాని ఈయన పాపం చేశాడని తెలియలేదు. మనుష్యుల్ని మోసం చేయవచ్చు, యెహోషువలాంటి నాయకుల్ని మోసం చేయవచ్చు, కానీ దేవునిని మోసం చేయలేము, ఆయన దగ్గర నుంచి తప్పించుకోలేము. దేవుడు సర్వవ్యాపి, ఆయనకు మరుగైన స్థలం ఏదీ లేదు.

*స్వార్థపూరితంగా వ్యవహరించాడు (6:19, 7:21):* యెరికోలో పట్టబడిన వెండి, బంగారు, ఇత్తడి పాత్రలు, ఇనుప పాత్రలు యెహోవాకు ప్రతిష్టితమవుతాయి, వాటిని యెహోవా ధనాగారంలో ఉంచాలి (6:19) అనే ఆజ్ఞకు ఆకాను తప్ప ఇశ్రాయేలీయులందరు లోబడ్డారు. ఆకాను మాత్రం దేవుని మందిరానికి చెందాల్సిన వాటిని స్వార్థంతో రహస్యంగా దొంగిలించి దాచుకొన్నాడు. ప్రభువుకు చెందాల్సిన వాటిని దొంగిలించకూడదు, దాచుకోకూడదు.

*పశ్చాత్తాపం లేదు (7:20):* పాపం చేసిన ఆకాను పట్టబడి గత్యంతరం లేక తాను చేసినదంతా ఒప్పుకొన్నాడు. అది పశ్చాత్తాపంతో కూడిన ఒప్పుకోలు కాదు. సమయం మించిపోయాక ఒప్పుకొన్నా క్షమించబడడం సాధ్యం కాదు.

*పర్యవసానాల్ని లెక్క చేయలేదు (6:18, 7:4-25):* శపింపబడినదానిలో కొంచెమైనను మీరు తీసికొనిన యెడల మీరు శాపగ్రస్తులవుతారు (యెహోషువ 6:18). ఈ విషయాన్ని ముందుగానే యెహోషువా తెలియజేశాడు. ఆకాను చేసిన పాపము, ఇశ్రాయేలీయుల సమాజాన్ని, తన కుటుంబమంతటిని బాధించింది. హాయి ఎదుట మూడువేల మంది ఇశ్రాయేలీయులు నిలువలేకపోయారు, 36మంది హతమయ్యారు, జనుల గుండెలు కరిగి నీరైపోయాయి (7:4,5) ఆకాను దొంగిలించిన షీనారు వస్త్రాన్ని, వెండి, బంగారం, ఆకాను, కుమారులు, కుమార్తెలు, ఎద్దులు, గాడిదల ను, మందను, డేరాను, కలిగిన సమస్తాన్ని రాళ్ళతో కొట్టి చంపివేసి రాళ్ళకుప్ప వేశారు. (7:24,25). మన పాపములు మన తోటివారిని, కుటుంబాలను బాధించేవిగా వుండకూడదు. పాపం దేవునికి అగౌరవాన్ని తీసుకొస్తుంది, తోటి వారికి అపజయాన్ని ఇస్తుంది, కుటుంబానికి అవమానాన్ని మిగుల్చుతుంది, అత్యంత ప్రియమైన వారిని కోల్పోయేలా చేస్తుంది.

**- పి. సునీల్ జాకబ్**

# విద్యార్థి జ్వాల

Vol. 30, No.1 November 2023
A Publication of
UESI Publication Trust



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.



CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com



GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Year) - Rs. 400
GRADUATES (3 Year) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years)
Rs. 2000/-
OVERSEAS (10 Years) - Rs. 2000/-

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

December: The Uniqueness of Jesus Christ
**Note:** Please send your writeups on or before
**10th of every month**




## దేవునికి భయపడే వాళ్ళ జీవితంలో...

దేవుడు లేని రంగం ఉండదు.

దేవుడు లేని నిర్ణయాలు ఉండవు.

దేవుడు లేని స్థలం ఉండదు.

దేవుడే కేంద్ర స్థానం ఆక్రమిస్తాడు. ఆ కేంద్రం చుట్టూ మిగిలిన రంగాలు, పనులు, వ్యక్తులు తిరుగుతుంటారు.

దేవుని గూర్చిన నూతన ప్రత్యక్షత ప్రతిరోజు అనుభవిస్తూ ఉంటారు.

దేవుని కొరకు ఎంత క్రయమైనా చెల్లించడానికి, చివరికి ప్రాణమైనా అర్పించడానికి వెనుకాడరు.

ఆయనను సంతోషపరచడమే వారి జీవిత ధ్యేయం (2 కొరింథీ 5:7-10).

వాళ్ళ నిర్ణయాలు దేవుని చిత్త ప్రకారంగా ఉంటాయి.

## లోపలి పేజీల్లో...


- దేవుని భయం లేకపోతే... - 2
- పట్టుదల, పద్ధతి, ప్రణాళికతో - 4
- దేవుని భయం - 5
- రాజీపడడాన్ని జయిద్దాం! - 8
- అ'భయం' - 11
- స్వేచ్ఛనిచ్చే స్వచ్ఛత - 14
- విశ్వాస ప్రమాణాలు - 15
- జస్టిన్ మార్టిర్ - 18
- కుటుంబంలో కష్టాలు - 20
- నేను చాలా బిజీ - 23
- పిచ్చుక గూడు - 26
- భయం - 29
- కోశాధికారి లేఖ - 31
- భయమే అభయం - 32

# పట్టుదల, పద్ధతి, ప్రణాళికతో ప్రగతిపథంలోకి

పట్టుదల, పద్ధతి, ప్రణాళిక ప్రకారం ఆడడం వలన క్రికెట్ ప్రపంచ కప్ 2023లో ఇంతవరకు మనకు తిరుగు లేకుండా పోయింది. అత్యద్భుతంగా రాణించారు. ప్రాపంచిక విషయాలను ఎంతో శ్రద్ధగా చేస్తున్న అవిశ్వాసులు మనకు ఎంతో మాదిరిగా ఉన్నారని గమనిస్తాం.

ప్రార్థనాపూర్వకంగా కొంతమందిని ఇవాంజిలిస్టిక్ క్యాంప్స్‌కి, రిట్రీట్స్‌కి, గాస్పెల్ ఈవినింగ్స్‌కి హాజరయ్యేటట్లు చేయడం వలన మంచి ఫలితాలు వచ్చాయి. వారిలో యేసుక్రీస్తు ప్రేమను అంగీకరించి, ఆయనను వెంబడించే వారిని డిటి క్యాంప్స్‌కు నడిపించిన వారందరినీ అభినందిస్తూ ధన్యవాదాలు తెలుపుతున్నాను. వీరు అదే శిష్యత్వపు బాటలో పయనించాలంటే మన యంపిసిలు క్రమంగా ఉండాలని మనందరికీ బాగా తెలుసు. ప్రభువు యొక్క ప్రోత్సాహంతో ఈ బాధ్యతల్లో ముందుకు వెళదాం.



రానున్న డిసెంబర్ నెల సువార్త ప్రకటనకు ఎంతో అనుకూలమైనది. ఇప్పటికే మంచి ప్రసంగీకుల్ని ఎన్నుకొన్నాం. ఇంకా ఫైనలైజ్ కానివాళ్ళు త్వరపడాలి. అనుకూలమైన తేదీలు, స్థలం, వాతావరణం, ఆర్థిక వనరులు ప్రభువిస్తారు. ఆయన ప్రణాళికలో ఉండే వాళ్ళందరూ రావాలని పట్టుదల, పద్ధతి, ప్రణాళిక ప్రకారం ప్రభువును ప్రాధేయపడదాం. కొన్నిసార్లు చక్కగా మాట్లాడే స్పీకర్స్‌ని ఫిక్స్ చేయడం ద్వారా రిలాక్స్ అయ్యే ప్రమాదముంది. పరిశుద్ధాత్ముడు ప్రజల హృదయాల్లో పనిచేయకపోతే ఎంతమంచి ప్రసంగమైనా వృథానే. దేవుని అద్భుతమైన సహాయం కొరకు ఇప్పటి నుంచే ప్రార్థిద్దాం. ఫాలోఅప్ కూడా ప్రధానమైనదిగా ఎంచుదాం. మనం ప్రజల కొరకు శ్రద్ధతో చేసే ప్రార్థనల ఫలితాన్ని ప్రస్ఫుటంగా చూద్దాం.

కండబలంతో, కనకంతో సాధించలేనివి – కన్నీళ్ళతో సాధిద్దాం.

అంగబలంతో సాధించలేనివి – అంగలార్పుతో సాధిద్దాం.

ప్రతిభతో సాధించలేనివి – ప్రలాపంతో సాధిద్దాం.

ప్రపంచమే ప్రగతి పథంలో పయనిస్తున్నప్పుడు, ప్రభువు పిల్లలు కూడా పవిత్రమైన విషయాల్లో తప్పక ప్రగతిని సాధించాలి. దానికోసం ప్రతిజ్ఞతో కూడిన మనసుతో కొనసాగాలని కోరుతూ...

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్
యుఇయస్ఐ-ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు



కవర్ కథనం

# దేవుని భయం

మానవ జీవితం ఎంపికల మయం. ఒక రోజులో చేసే నిర్ణయాల వెనుక ఎన్నో ఎంపికలు జరుగుతాయి. మన నిర్ణయాలే మన గమ్యాన్ని నిర్ధారిస్తాయి. ఈ నిర్ణయాల్లో మంచి నిర్ణయాలు, తప్పుడు నిర్ణయాలు కూడా ఉంటాయి. కొన్ని తప్పుడు నిర్ణయాలు తిరుగులేని ప్రభావాన్ని చూపి ఆ వ్యక్తి జీవిత గమనాన్ని పూర్తిగా మార్చి వేస్తాయి. ఒక విశ్వాసి జీవితంలో కూడా నిర్ణయాలు చాలా ప్రాముఖ్యమైన పాత్ర వహిస్తాయి. నిర్ణయాల వెనక మనం ఏర్పరచుకొన్న దృక్పథాలు కీలక పాత్ర వహిస్తాయి. మనసులో ఏర్పడే దృక్పథాలు మార్చుకోవడం అంత సులభం కాదు. సత్యం మీద ఏర్పడిన దృక్పథాలు సరైన నిర్ణయాల వైపు మొగ్గు చూపుతాయి. కానీ లోకంలో మనకు ఎక్కువగా అందుబాటులో ఉండే సత్యాన్ని పోలిన నకిలీ సమాచారమే మన దృక్పథాలను ఏర్పరచుకోవడంలో అత్యంత ప్రభావం చూపిస్తుంది. ఇలాంటి లోకంలో ఆత్మసంబంధులైన వ్యక్తులంగా మన నిర్ణయాల ద్వారా విశ్వాస జీవితాన్ని ఏ విధంగా విజయవంతంగా ముగించగలం? సగటు విశ్వాసి జీవితంలో అపజయాలకు ముఖ్యకారణం మన మీద మనకున్న మితిమీరిన నమ్మకమేనని గ్రహించగలం. దేవుని వాక్యంలో చాలా స్పష్టంగా "నేను జ్ఞానిని గదా అని నీవనుకొనవద్దు, యెహోవా యందు భయభక్తులు కలిగి చెడుతనము విడిచిపెట్టుము" (సామె 3:7) అని ఉంది. జ్ఞానానికి, యెహోవాయందు భయము కలిగి ఉండడానికి సంబంధమేంటి? జ్ఞానానికి, భయానికి, చెడుతనము విడిచిపెట్టడానికి ఉన్న సంబంధం ఎలా అర్థం చేసుకోవాలి?

## 1. దేవుని భయం అంటే ఏంటి?

చాలామంది విశ్వాసులకు దేవుని భయం అంటే, దేవుడు పాపం చేసే వ్యక్తిపట్ల తన ఉగ్రతను, తీర్పును, శిక్షను అమలు చేస్తాడు కాబట్టి దేవునికి భయపడాలి అనుకొంటారు. అది మంచిదే కాని దేవుని వాక్యంలో 'దేవుని యందు భయము' అని రాయబడినప్పుడు ఆ అర్థంతో రాయబడలేదు. పోలీసుని చూసి దొంగ భయపడడం లాంటి భయం గూర్చి మనం ఇక్కడ ఆలోచించడం లేదు. దేవుని భయం అంటే దేవుని పట్ల గల అపారమైన ప్రేమలో నుంచి వచ్చిన గౌరవంతో కూడిన ఆరాధన భావం. ఆయన మనస్సును ఎక్కడ గాయపరుస్తానోనన్న జాగ్రత్తతో కూడిన భయం. అది తండ్రిని అమితంగా ప్రేమించే కుమారుడు లేక కుమార్తె చూపించే గౌరవంతో కూడిన భయం లాంటిది. అయితే ఈ గౌరవంతో కూడిన భయం అందరికి ఉండదు. ఎందుకంటే దేవుని ప్రేమించడానికి పూర్వం దేవుని మనసును అర్థం చేసుకొని తీరాలి. దేవుని ఉగ్రత, తీర్పు, పాపం చేయడం వలన కలుగే పర్యవసానాలు చాలామందికి దేవుని పట్ల భయాన్ని కలుగజేస్తాయి. ఈ భయం వలన చెడుతనాన్ని విసర్జించడం సాధ్యం కాదు.

దేవుని సార్వభౌమత్వం, సమస్తాన్ని చూడగల ఆయన జ్ఞానాన్ని గూర్చిన అవగాహన, ఆయన పరిశుద్ధతను గూర్చిన ఎరుక, ఆయన నీతి, సత్యసంధత్వము లాంటి ఆయన లక్షణాలను అర్థం చేసుకొన్నప్పుడు దేవుడు మనలను ఇంతగా ప్రేమించడానికి కారణం కనిపించదు. ఇంత గొప్ప దేవునికి నాపై ఉన్న ఈ వింత ప్రేమ అర్థమైనప్పుడు ఆయనను దు:ఖపెట్టడానికి, ఆయన మనసు గాయపర్చడానికి కాళ్ళు గజగజ వణుకుతాయి. అప్పుడు నాలో నుంచి వచ్చే భావోద్రేకాన్ని దేవుని వాక్యంలో భయం రూపంలో వర్ణించడం జరిగింది. దేవునికి ఇష్టం కానిది, ఆయనను బాధపరిచేది చేయడానికి మనసు ఒప్పుకోకపోవడమనే భావననే దేవుని పట్ల విశ్వాసి చూపే భక్తితో కూడిన భయంగా చెప్పబడింది.

ఈ భావోద్రేకాన్ని క్రియారూపంలో దేవునిపట్ల కనుపరచడాన్ని దైవవాక్యం వివిధ రకాలుగా వివరించింది.

**ఎ. దేవునికి భయపడడమంటే దేవుని మీద ఏక దృష్టి కలిగి ఉండడం.**

ఇంగ్లీష్‌లో దానిని 'అన్‌డివైడెడ్ అటెన్షన్' అంటారు. "నీ నామమునకు భయపడునట్లు నా హృదయమునకు ఏకదృష్టి కలుగజేయుము"- కీర్తన 86:11

ఈ 'భయం' దేవునిపై ఉండే అమితమైన ప్రేమలో నుండి పుట్టినది. ఈ జీవిత ప్రయాణంలో మన దృష్టి అంతా ఆయనపై మాత్రమే ఉండాలని దేవుడు కోరుకొంటాడు. మన జీవితంలో ఆయన ఏదో ఒక స్థానాన్ని కోరుకోడు. మన జీవితంలో ఆయనే అతి ప్రాముఖ్యమైన వ్యక్తిగా ఉండాలని, కేంద్ర బిందువుగా ఉండాలని ఆయన కోరుకొంటాడు. జీవితంలో జరిగే రకరకాల కార్యక్రమాలలో ఆయన కూడా ఒక కార్యక్రమంలాగా ఉండాలని కోరుకోడు. ఆయన దానికి ఒప్పుకోడు. ఆయన మన జీవితాలకు కేంద్రస్థానంలో ఉండి తక్కిన కార్యక్రమాలన్నీ ఆయన చుట్టూ, వాటి వాటి స్థానాలలో పరిభ్రమిస్తూ ఉండాలని కోరుకొంటాడు. అవి ఏవీ ఆయన స్థానాన్ని ఆక్రమించకూడదు.

ఆయన వైపు చూస్తూ, నా నిర్ణయాలన్నీ తీసుకోవాలి. ఆయన ప్రస్తావన లేకుండా నాజీవితంలో ఏ రంగం కూడా పనిచేయదు. నా భౌతిక రంగం, మానసిక రంగం, భావోద్రేక రంగం, సామాజిక రంగం, ఆధ్యాత్మిక రంగం ఏదైనా అందులో ఆయనకు కష్టం కలిగించేది, ఆయన మనసును బాధపెట్టేవి చేయడానికి నా చేతులు వణకాలి, దానినే దేవునికి భయపడడం అంటారు. ఇది ప్రేమలో నుంచి వచ్చిన ఆరాధన భావమే గాని భయంతో సంబంధంలేనిది.

**బి. దేవునికి భయపడడం అంటే, ఆయనే నాకు అత్యంత ఆశ్చర్యం, సంభ్రమం కలిగించే వాడుగా ఉండడం.**

"యెహోవా మహోన్నతుడు, భయంకరుడు" (కీర్తన 47:2). 'భయంకరుడు' అనే పదానికి భయం కలిగించేవాడు అని అర్థం. ఇది ఆశ్చర్యంలోనుంచి వచ్చిన భయం. ఇది ఇశ్రాయేలు వారి 'ఆరాధన పదం'. మనసుకు అర్థం కావడం వలన ఆశ్చర్యంతో భావోద్రేకాలు రేకెత్తించేవానిగా ఆయనను అనుభవించడం. ఆయన గొప్పతనాన్ని మన మనోనేత్రాలతో గ్రహించినప్పుడు ఆ సత్యం మన మనసులను వశపరచుకొని, ఆశ్చర్యచకితులగాను, సంభ్రమాశ్చర్యాలతో నిండి ఆయన పాదాల మీద పడి ఆయనను పూజించే వానిగాను చేయడమే దేవుని భయం.

ఆదికాండం నుండి ప్రకటన వరకు ఆయన ఏమి చేశాడో అర్థం చేసుకొన్నప్పుడు భయంతో కూడిన ఆశ్చర్యం అనుభవించక తప్పదు. ఆయన ఎంత మంచివాడో, ఎంత ప్రేమగలవాడో ఎంత శక్తిమంతుడో, ఎంత న్యాయవంతుడో, ఎంత నమ్మకస్తుడో... ఆ విషయాలు మన మనసుకి అర్థమై ఆ తలంపులతో మనసు నిండిపోయినప్పుడు వచ్చే అనిర్వచనీయమైన అనుభవమే ఆ సంభ్రమాశ్చర్యం. మనో నేత్రాలు తెరవబడినవారే దేవునికి భయపడడం అనే అనుభవాన్ని అర్థం చేసుకోగలరు (ఎఫెసీ 1:17-19).

**సి. దేవునికి భయపడడం అంటే దేవునికి మన సంపూర్ణ విధేయతను కనబరుస్తూ ఆయన పక్షంగా జీవించడమే.**

"కాబట్టి ఇశ్రాయేలూ! నీ దేవుడైన యెహోవాకు భయపడి ఆయన మార్గములన్నిటిలో నడుచుచు, ఆయనను ప్రేమించి నీ దేవుడైన యెహోవాను నీ పూర్ణ మనస్సుతోను, నీ పూర్ణఆత్మతోను సేవించి... " (ద్వితీ 10:12).

దేవునికి భయపడడమంటే ఆయన పట్ల ఉన్న అమితమైన ప్రేమ, నన్ను సంపూర్ణమైన మనసుతో, ఆత్మతో అన్ని విషయాలలో ఆయనకు నమ్మకస్తునిగా, విధేయునిగా ఉండడానికి బలవతం చేస్తుంది. ఏ వస్తువు, ఏ మనిషి నాకు దేవునికంటే ఎక్కువ కాదు అనే స్థిర నిశ్చయతే దేవునికి భయపడడం.

నన్ను ప్రేమించి నా కొరకు తన ప్రాణాన్ని ఇచ్చి, నా పాప శాపాన్ని తనమీద వేసుకొని నన్ను విమోచించి, నా మీద తన నీతిని అపాదించి నన్ను నిత్య జీవానికి హక్కుదారునిగా చేసిన ఆయనకు తప్ప నా విధేయతను ఎవరికి చూపించగలను? ఆయన ప్రేమగల హృదయాన్ని బాధపెడతానేమోనన్న భయం, జాగ్రత్త నిరంతరం నన్ను వెండిస్తున్నప్పుడు నా మాటల విషయంలో, నా చేతల విషయంలో, నా ఆలోచనలు, ఉద్దేశాల విషయంలో, నా రహస్య బహిరంగ జీవితంలో, నా లావాదేవీలలో, నా నిర్ణయాలలో, నా కోరికలలో, నా భావోద్రేకాలలో ఎంతో జాగ్రత్త

వహిస్తాను. దీనినే దేవుని యెడల భయభక్తులు కలిగి ఉండడం అంటాము.

దేవుని యెడల భయభక్తులు గల వ్యక్తుల జీవితాలను దైవగ్రంథంలో పరీక్షించినప్పుడు మనకు ఈ లక్షణాలే కనబడతాయి.

## దావీదు జీవితంలో దేవుని భయం

దావీదు జీవితం దేవుని భయం కలిగిన వ్యక్తి ఎలా ప్రవర్తిస్తాడో, ఆ భయం లేనప్పుడు ఎలా ప్రవర్తిస్తాడో గమనించడానికి ఒక చక్కని ఉదాహరణ.

దావీదు చిన్నవయసులోనే, తన తండ్రి గొర్రెల మందను కాసే సమయంలో, దేవుని గూర్చిన అవగాహనను కలిగి ఉన్నాడు.. దేవుని వాస్తవికతను, ఆయన సామర్థ్యాన్ని, సత్యసంధత్వాన్ని, కాపుదలను, అనుభవపూర్వకంగా ఎరిగాడు. అందుకే ఇశ్రాయేలీయులు గొల్యాతుకు, ఫిలిష్తీయులకు భయపడుతున్నప్పుడు, దావీదు ప్రవర్తన దానికి భిన్నంగా ఉంది. దావీదు గొల్యాతును చూసినప్పుడు గొల్యాతు వెనుక అతనికంటే గొప్పవాడు, శక్తిమంతుడు, సజీవుడైన ఇశ్రాయేలు దేవునిని తన మనోనేత్రాలతో చూశాడు. దేవునికి 'భయపడేవాడు' మరిదేనికీ భయపడనవసరంలేదని లోకానికి అతని జీవితం చాటి చెప్పింది (1సమూ 17:45-47). కానీ సౌలు దావీదును చంపడానికి ప్రయత్నించినప్పుడు దావీదు జీవంగల దేవునినిగాక పరిస్థితులకు, వ్యక్తులకు భయపడినప్పుడు మరణ భయము అతనిని ఆవరించింది (1 సమూ 20:36). ఆ భయము అతనిని బుద్ధిహీనమైన, నష్టకరమైన నిర్ణయాలకు, ఎంపికలకు నడిపించింది. అహీమెలెకు అనే యాజకునితో అబద్ధాలు చెప్పడానికి (1సమూ 21:2,5,8), గాతు రాజైన ఆకీషు ముందట పిచ్చివానిలా ప్రవర్తించడానికి ప్రోత్సహించింది (1 సమూ 21:12,13).

ఆ తర్వాత తన జీవితము గురించి, తన భయాల గురించి తన ప్రవర్తన గురించి దేవుని సన్నిధిలో దు:ఖపడి, ఒప్పుకొని దేవుని యొద్ద విచారణ చేసిన దావీదు, అదుల్లాము గుహలో తన అనుభవాన్ని 34వ కీర్తనలో రాశాడు (34:4,7-10). దేవునియందు భయభక్తులు దావీదు జీవితాన్ని తిరిగి దేవుని హృదయానుసారునిగా మార్చి వేసింది.

దేవుని ఇష్టమే తన ఇష్టమని, దేవునికి బాధ కలిగించేది తన జీవితంలో నుంచి తీసివేసు కొంటానని నిర్ణయించుకొని నడిచాడు. 1 సమూయేలు 23 అధ్యాయంలో ఒక కొత్త దావీదును మనం చూస్తాము. తన జీవిత యాత్రలో ప్రతి నిర్ణయానికి దేవుని అనుమతి, దేవుని చిత్తాన్ని అడిగి తెలుసుకొని తన అగుడులు వేశాడు (1 సమూ 23:2,4,10).

## ముగింపు

అబ్రహాము, మోషే, దానియేలు, ఎలీషా మొదలగు పాతనిబంధన భక్తులు మరియు పేతురు, పౌలు మొదలగు క్రొత్త నిబంధన భక్తుల జీవితాలలో దేవుని భయం వారిని ఆయనను అత్యంత మిక్కుటంగా ప్రేమించి, ఆయనకు ఇష్టపూర్వకంగా జీవించేటట్లు చేసింది.

ఒక వ్యక్తి దేవునికి భయపడడానికి కారణం, దేవుని గూర్చిన సరైన అవగాహన మాత్రమే. దేవుని గూర్చిన అవగాహన దేవుని వాక్యాన్ని ధ్యానించేటప్పుడు పరిశుద్ధాత్మ దేవుడు ఆయనను గూర్చిన ప్రత్యక్షతను మన మనసులకు తెలియజేయడం ద్వారా లభిస్తుంది. ఈ అవగాహన ఎవరికి ఉంటుందో వారికి దేవుని పట్ల విపరీతమైన ప్రేమ, గౌరవం, ఆరాధన భావం కలుగుతాయి.

వాళ్ళ జీవితంలో దేవుడు లేని రంగం ఉండదు.

వాళ్ళ జీవితంలో దేవుడు లేని నిర్ణయాలు ఉండవు.

వాళ్ళ జీవితంలో దేవుడు లేని స్థలం ఉండదు.

వాళ్ళ జీవితంలో దేవుడే కేంద్ర స్థానం ఆక్రమిస్తాడు. ఆ కేంద్రం చుట్టూ తక్కిన రంగాలు, పనులు, వ్యక్తులు తిరుగుతుంటారు.

వాళ్ళ జీవితంలో దేవుని గూర్చిన నూతన ప్రత్యక్షత ప్రతిరోజు అనుభవిస్తూ ఉంటారు.

వాళ్ళు దేవుని కొరకు ఎంత క్రయమైనా చెల్లించడానికి, చివరికి ప్రాణమైనా అర్పించడానికి వెనుకాడరు.

ఆయనను సంతోషపరచడమే వారి జీవిత ధ్యేయం (2 కొరింథీ 5:7-10).

వాళ్ళ నిర్ణయాలు దేవుని చిత్త ప్రకారంగా ఉంటాయి. ఎందుకంటే ఆయనే వారిని తన వాక్యం ద్వారా, ఆత్మద్వారా నడిపిస్తాడు. ఆయన నడిపిస్తున్నప్పుడు దానికనుగుణంగా మనం నడుస్తున్నప్పుడు తప్పు నిర్ణయాలకు, చెడు క్రియలకు తావు లేదు.

– కె. దేవిడ్ రాజ్ కుమార్, గుంటూరు

# రాజీపడడాన్ని జయిద్దాం!

## దానియేలు 1:1-21



ఈ శతాబ్దం ప్రారంభంలో ఒకసారి ఒక అమెరికా నౌక ఇంగ్లాండు సముద్ర తీరానికి దగ్గర్లో ఉన్న సిసిలీ ద్వీపాల వద్ద మునిగిపోయింది. దీనికి కారణం దీనిని తయారు చేసేటప్పుడు నిబంధనల్లో రాజీపడడమే. జీవితంలో కూడా విల ువలలో రాజీపడడం మన ఆత్మలను చల్లార్చుతుంది. ఆత్మీయంగా చల్లారడం అనే పరిస్థితి చాపకింద నీరులాగా మనం గుర్తించని రీతిలో వస్తుంది. పాపాన్ని గట్టిగా వ్యతిరేకించే శక్తిని, పరిశుద్ధత పట్ల తీవ్రమైన వాంఛను కోల్పోయినప్పుడు ఇది జరుగుతుంది.

### రాజీపడడం అంటే?

1. ఇరువురి అంగీకారంపై కొన్ని విబేధాలను, తగాదాలను పరిష్కరించడం.
2. రెండు విరుద్ధమైన విషయాలకు మధ్యస్తంగా ఉండే పరిస్థితి.
3. విరుద్ధమైన, వ్యతిరేకమైన విషయాలు, సూత్రాలలోని తీవ్రతను పరస్పర అంగీకారంతో తగ్గించి వాటిని సవరించడం.

జీవితంలో తరచుగా రాజీపడే పరిస్థితులు ఎన్నో వస్తుంటాయి. మనం ఎలా జీవించాలి? ఎలాంటి జీవన మార్గాన్ని ఎంచుకోవాలి? అనే విషయంలో మనకు స్వేచ్ఛ ఉంది. నిర్ణయాలు తీసుకొనే సమయం వచ్చేసరికి మనం దైవభక్తితో కూడిన నిర్ణయాలు తీసుకొంటాము. ఎందుకంటే జీవితంలోని కీలకమైన సమయాల్లో మనం తీసుకొనే నిర్ణయాలు దేవునికి, దేవుని పనిలో మనం ఎంతగా ఉపయోగపడతామనే విషయాన్ని అవి నిర్ణయిస్తాయి.

ప్రస్తుతం మనం తీసుకొన్న వాక్య భాగంలో నలుగురు వ్యక్తులు ఉన్నారు. వీరు తీసుకొన్న నిర్ణయం వారి జీవితాలనే మార్చివేసింది. ఈ సంఘటన జరిగిన రోజు నుండి దానియేలు, షద్రకు, మేషాకు, అబెద్నగోలు గొప్ప విశ్వాస వీరులుగా నిలిచిపోయారు. తాము యవ్వనస్తులుగా ఉన్నప్పుడు దేవునికి భయపడి, ఆయనకోసం నిలబడకపోతే, వీరి గురించి ఎవ్వరికీ తెలిసుండేది కాదు. ఈ నలుగురు యవ్వనస్తులు తాము ఎదుర్కొన్న పరీక్షలో నెగ్గారు. తద్వారా వీరి జీవితాలు అనేకులకు ఆశీర్వాదకరంగా ఉన్నాయి.

### వ.1-7 వారి ముందున్న సమస్యలు

ఈ హెబ్రీ యువకులు చాలా సమస్యలు ఎదుర్కొన్నారు. ప్రతి సమస్యను ఎదుర్కొనే ఆధ్యాత్మిక సామర్థ్యం వారికి ఉంది. వారు ఎదుర్కొన్న సమస్యలు మనం దైనందిన జీవితంలో ఎదుర్కొనే సమస్యల లాంటివే.

**1. వ 1-2. కొత్త ప్రదేశం:** ఈ యువకులు యెరూషలేము, లేదా దాని పరిసర ప్రాంతాల్లో పుట్టి పెరిగారు. దేవుని భయభక్తుల్లో పెరిగారు. జీవితంలో దేవుని ప్రాముఖ్యతేంటో వారికి తెలుసు. దేవాలయంలో ఇచ్చే బలులు, శాస్త్రులు దేవుని వాక్యాన్ని బోధించడాన్ని, ప్రవక్తలు ప్రవచించడాన్ని వారు చూశారు. కానీ ఇది గతం. ప్రస్తుతం వారు బబులోను చెరలో ఉన్నారు. వారి చుట్టూ అన్యులు, వారి విగ్రహారాధన, వారి సాంప్రదాయాలు ఉన్నాయి. అలాంటి పరిస్థితులకు లొంగిపోవడానికి చాలా అవకాశాలున్నాయి.

క్రైస్తవులకు కూడా తమ చుట్టూ ఇలాంటి పరిస్థితులే ఉంటాయి. సంఘంలో ఉన్నప్పుడు, విశ్వాసులతో ఉన్నప్పుడు భక్తిగా జీవించడం చాలా తేలిక. కానీ వీరి నుండి దూరంగా ఉండాల్సివచ్చినప్పుడు, మన చుట్టూ ఉండే పరిస్థితులకు రాజీపడుతున్నాము.

కాబట్టి మనము నిలకడగా సంఘానికి, సహవాసానికి హాజరవుతూ ఉండాలి (హెబ్రీ 10:25). దేవుని ప్రజల సహవాసాన్ని మనం ఎప్పుడూ విడిచి పెట్టకూడదు (1 కొరింథీ 15:33).

**2. వ.3-4 క్రొత్తజ్ఞానం:** ఈ యవ్వనస్తులకు నూతన భాష, నూతన జీవన విధానం బబులోను అధికారులు నేర్పించారు. ఇప్పటి వరకు వారికి హెబ్రీ జీవనశైలి, భాష మాత్రమే తెలుసు. కానీ ఇప్పుడు వారు బబులోను జ్ఞానం నేర్చుకోవాల్సి వచ్చింది. ఇంతకు మునుపు తమ జీవితంలో ఎన్నడూ చూడని పరిస్థితుల్లో వారు ఉండాల్సి వచ్చింది. ఇది చాలా ప్రమాదకరమని వారికి తోచింది. తమ చుట్టూ ఉన్న పరిస్థితులకు లొంగిపోయే విధంగా వారిపై తీవ్రమైన ఒత్తిడి వచ్చింది.

ఈ రోజుల్లో క్రైస్తవులు కూడా ఇలాంటి ప్రమాదాన్నే ఎదుర్కొంటున్నారు. దేవుని కోణంలో నుండి ప్రతిదాన్ని చూడడం అనేది కాలం చెల్లిన విధానం అనే పోకడలు మన ముందు కన్పిస్తున్నాయి. ఎన్నో రకాల ఒత్తిళ్ళు క్రైస్తవుల మీదకు వస్తున్నాయి. కానీ దేవుడు తన వాక్య ప్రమాణాలను మార్పు చేయడని గుర్తుంచుకోవాలి (కీర్తన119:89; యెషయా 40:8).

**3. వ.5 కొత్త ఆహారము:** ఆహారానికి సంబంధించి ధర్మశాస్త్రంలో దేవుడు తెలియజేసిన నియమాలనే ఈ నలుగురు యువకులు ఇప్పటి వరకు పాటిస్తూ వచ్చారు. కానీ ఇప్పుడు వారు ఎన్నడూ తినని ఆహారం వారిముందు ఉన్నది. ధర్మశాస్త్రం ప్రకారం అదంతా అపవిత్రమైన ఆహారం. ఆ మాంసమంతా విగ్రహాలకు అర్పించినదే. కాబట్టి ఈ ఆహారము వారిని అపవిత్రపరుస్తుంది.

మన జీవితము పట్ల దేవుని చిత్తానికి వ్యతిరేకమైన నిర్ణయాలు తీసుకొనే పరిస్థితులు మనకు ప్రతి రోజూ వస్తాయి. ఈ నిర్ణయాలు మనం వినే సంగీతానికి సంబంధించినవి కావచ్చు, మనల్ని సంతోషపరిచే, ఆహ్లాదపరిచే పనులు చేయించడానికి సంబంధించినవి కావచ్చు. మనల్ని పవిత్రంగా ఉంచే పనులు చేయాలా? లేక మనల్ని అపవిత్రపరచే పనులు చేయాలా? అనే పరిస్థితి మనకు ప్రతిరోజూ ఎదురవుతూనే ఉంటుంది. మనం రాజీపడితే రక్షణను కోల్పోముగాని భ్రష్టులమౌతాము (1 కొరింథీ 9:27). కాబట్టి మనం మన జీవితాలను జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఈ విషయంలో దావీదుకు ఒక చక్కటి ప్రణాళిక ఉన్నది (కీర్తన 101:3).

**4. వ. 6-7 కొత్తపేర్లు:** ఈ నలుగురు హెబ్రీ యువకులకు చక్కని హెబ్రీ పేర్లు ఉన్నాయి. అవి దేవుని గూర్చి తెలియజేసే పేర్లు..

అ) దానియేలు: దేవుడు నాకు న్యాయాధిపతి.

ఆ) హనన్యా: కృపగల దేవుడు.

ఇ) మిషాయేలు: దేవునికి సాటియనవారు లేరు.

ఈ) అజర్యా: దేవుడు నాకు సహాయము.

బబులోనుకు వీరిని చెరగా తీసుకొని పోయినప్పుడు ఆ పేర్లు మార్చి వేశారు.

అ) దానియేలు-బెల్తెషాజరు: 'బయలు' రక్షిస్తాడు.

ఆ) హనన్యా-షద్రక్: 'సూర్య దేవుని' ప్రేరణ.

ఇ) మిషాయేలు-మేషాకు: 'ఆకు' సంబంధి.

ఈ) అజర్యా-అబెద్నెగో: 'నెగో' సేవకుడు.

ఈ నలుగురి గుర్తింపును, వారి ఆలోచనా విధానాన్ని మార్చాలన్నదే నెబుకద్నెజరు ప్రణాళిక. కానీ వారి పేర్లు మారినా వారు మాత్రం మారలేదు. లోకం, సాతాను మన చుట్టూ ఉండే పరిస్థితులకు లోబడేటట్లు ఒత్తిడి చేస్తాయి. కానీ మనం దేవుని పిల్లలమన్న సత్యాన్ని ఎన్నడూ మరచిపోకూడదు.

ఈ జీవిత ప్రయాణంలో మనల్ని పాపంలోకి నెట్టివేయాలని సాతాను ప్రయత్నాలు చేస్తూనే ఉంటాడు. కానీ ఇలాంటి సమయాల్లో సహాయం చేస్తానని దేవుడు వాగ్దానం చేశాడు (1 కొరింథీ 10:13; హెబ్రీ 4:15).

## వ.8-16: వారి హృదయ స్థితి

**అ) వ.8. వారి సమర్పణ జీవితం:** బబులోనీయులు వారి గృహాలను, ఆహారాన్ని, పేర్లను, విద్యను మార్చగలిగారు గానీ వారి హృదయాన్ని మాత్రం మార్చలేకపోయారు. ఏది ఏమైనప్పటికీ వీరు దేవునికోసం నిలబడడానికే నిర్ణయించుకొన్నారు. "అందరూ ఇలానే చేస్తున్నారు, మనం కూడా అలానే చేద్దాం, రాజుగారు చెప్పింది చేయడం శ్రేష్టం, బయటకు రాజుకు లోబడదాం, అంతర్గతంగా మన విశ్వాసం ప్రకారం జీవిద్దాం" వంటి మాటలు చెప్పలేదు. అలా ఆలోచించలేదు. ఎలాంటి పరిణామాలు వచ్చినా దేవునికే లోబడాలని నిర్ణయించుకొన్నారు. విశ్వాసులమైన మనం కూడా ఇలాంటి స్థిరమైన నిర్ణయం తీసుకోవాలి. మన ప్రాణం పోయినా సరే, దేవునికి, ఆయన చిత్తానికి మనం విధేయులమవ్వాలి. మనం నమ్మకంగా

ఆయనను సేవించడమే మన బాధ్యత. మిగిలినవన్నీ ఆయనే చూచుకొంటాడు (రోమా 12:1,2; 1 కొరింథీ 15:58).

**ఆ) వ. 9-14: వారి ఆశ:** దేవుని ఎదుట పరిశుద్ధులుగా ఉండుటకు, అపవిత్రమైన భోజనాన్ని తినకుండా తమకు మినహాయింపు ఇవ్వమని వీరు ఆ అధికారిని కోరారు. కాయగూరలతో కూడిన భోజనం తమను అపవిత్రపరచదని వారికి తెలుసు. ఆ భోజనాన్ని తింటే, ఆయనపై విశ్వాసాన్ని బట్టి దేవుడు తమను గౌరవిస్తాడని కూడా వారికి తెలుసు. దేవుని కోసం నిలబడడం అంత సులువైనది, అందరూ మెచ్చుకొనే పనేమీ కాదు. నీ చుట్టూ ఉన్నవారు నిన్ను అపార్థం చేసుకోవచ్చు. కాని అదే ఉత్తమమైన పని. మనం దేవుని కోసం నిలబడితే ఆయన మనల్ని ఖచ్చితంగా ఆశీర్వదిస్తాడు (మత్తయి6:33).

**ఇ)** ఈ వాక్యభాగంలో ఉన్న సారాంశం ఏంటంటే ఈ నలుగురు యువకులు దేవుని కోసం జీవించాలని దృఢ నిర్ణయం తీసుకున్నారు. వారు తమ నిర్ణయాన్ని మార్చే అవకాశం ఎవరికీ ఇవ్వలేదు. 3వ అధ్యాయంలో వీరు మరణించడానికైనా సిద్ధపడ్డారు గాని, రాజీపడలేదు. 6వ అధ్యాయంలో 80 సం॥ పైబడిన దానియేలు కూడా సింహాల గుహలోనికి వెళ్ళడానికి సిద్ధపడ్డాడే గాని రాజీపడలేదు. మరి మన సంగతి ఏమిటి? మనకు కూడా అలాంటి దృఢ చిత్తం ఉన్నదా?

**ఈ)** బహుశా మనం అలా నిలబడలేమేమో అని నేను అనుకుంటున్నాను. మనం అనేక విషయాల్లో రాజీపడుతున్నాము. మాటలలో, వస్త్రధారణలో, జీవన విధానంలో, సంగీతం వినే, పాడే విషయంలో ఇంకా ఎన్నో విషయాల్లో శరీరం, లోకం, సాతానుకు వీరు లోబడకూడదని హృదయంలో వారు నిశ్చయించుకున్నారు. మన జీవితంలో కూడా అలాంటి ప్రమాణాలనే కలిగివుండాలి. మనలో తిరిగి దేవునికి సమర్పించుకోవాల్సిన అవసరం ఉన్నవాళ్ళు చాలామంది ఉన్నారు. మరికొంతమంది రాజీపడే పరిస్థితికి దగ్గరగా ఉన్నవాళ్ళు ఉన్నారు. యేసుక్రీస్తు నామమునకు అవమానము కలుగజేయకూడదని, ఏది ఏమైనా ఆయన కోసము జీవించాలి అని నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఇది.

**ఉ)** ఈ యువకుల సమర్పణను క్లుప్తంగా మూడు మాటల్లో చెప్పవచ్చు. 1. దేవుని భయం, 2. విశ్వాసం 3. విధేయత. దేవుడు తన వాగ్దానాలను నెరవేరుస్తాడని వారు నమ్మారు. ఎంత వెలచెల్లించాల్సి వచ్చినా సరే దేవుని వెంబడించడానికే వారు నిర్ణయించుకొన్నారు. మరి మన సంగతేంటి?

## వ.17-24: పరలోకం నుండి పదోన్నతి

**అ) వ.15,16: వారి అనుభవం:** దేవుడు ఈ యువకులను ఎంతో ఆశీర్వదించాడు. వీరు బబులోను దేశాన్ని ప్రభావితం చేసే స్థాయికి ఎదిగారు. మనలో ఎవరికీ అర్థంకాని విషయం ఈ నలుగురు యువకులకు అర్థమైంది. ఆయన మనల్ని ఎన్నడూ విడిచిపెట్టడు. ఆయన తన వాక్యాన్ని గౌరవిస్తారు. ఆ వాక్యానికి లోబడి జీవించే వారిని కూడా ఆయన గౌరవిస్తాడు (విలాప 3:23; హెబ్రీ 6:13-19). ఏం జరిగినా ఆయనే చూచుకొంటాడు.

**ఆ) వ 17-20. వారు ఎంతో రాణించారు:** మూడు సం॥ల తర్వాత (ఈ మూడు సం॥ తమ నిర్ణయానికే కట్టుబడి ఉన్నారు) వీరు రాజు ముందు నిలబడ్డారు. రాజు వారితో మాట్లాడినప్పుడు ఇతరుల కన్నా 10 రెట్లు ఉత్తమమైన వారిగా ఆయన గమనించాడు. దేవునిని గౌరవించే వారిని దేవుడు గౌరవిస్తాడని ఈ విషయం మనకు గుర్తు చేస్తుంది. అలాగని దేవుని సేవిస్తే మనకు చాలా పేరు ప్రఖ్యాతులు వస్తాయని కాదు. దేవుని పనిలో నమ్మకంగా ఉంటే ఆయన ఇంకా ఉన్నతమైన పనిని ఇస్తారని ఈ సంఘటన మనకు తెలియజేస్తుంది. తన మహిమార్థమై దేవుడు వీరిని ఎంతో ఉన్నతమైన స్థానంలో నిలబెట్టాడు. చిన్న చిన్న విషయాల్లో కూడా రాజీపడకుండా జీవించడమే ఇందులో ఉన్న రహస్యం.

**ఇ) వ. 21: వారి సహనం:** షద్రకు, మేషాకు, అబెద్నెగోలు బబులోనులో ఎంతకాలం ఉన్నారో మనకు తెలియదు గాని, దానియేలు మాత్రం ఉన్నతమైన స్థానంలో ఉండి చాలా సంవత్సరాలు బబులోనులో పనిచేశాడు. మనం స్థిరంగా దేవునికోసం జీవిస్తూ ఉంటే మనం ఎంతకాలం జీవిస్తాము, ఎక్కడ జీవిస్తాము అన్న ప్రశ్నలకు అతీతంగా దేవుడు మనల్ని వాడుకొంటాడు. తనకు యోగ్యమైన పాత్రల కోసం దేవుడు వెదకుచున్నాడు (2 తిమోతి 2:20,21). దేవుని గృహములో చాలా రకాల పాత్రలు ఉన్నాయి. కొన్ని ఘనమైనవి, కొన్ని ఘనహీనమైనవి. నీవు ఎలాంటి పాత్రగా ఉన్నావు?

– విజే డెస్క్



# అ'భయం'

గతనెల మొరాకో దేశంలో (ఆఫ్రికా) కలిగిన భూకంపం, మూడు నెలల క్రితం ఒడిశా రాష్ట్రంలో జరిగిన రైలు ప్రమాదం లాంటి వార్తలు విన్నప్పుడు, చూసినప్పుడు ఎంతో భయం, బాధ, నిట్టూర్పు కలగడం సహజం. ప్రతి జీవి మరణాన్ని ఎదుర్కోవాల్సిందే, భయంతోనో లేదా ధైర్యంతోనో వాస్తవాన్ని ఎదుర్కోవాలి.

సజీవుడైన దేవునియందు మనముంచిన విశ్వాసము జీవితంలోని భయాన్ని తొలగిస్తుంది. ఓ ప్రక్క దేశాల మధ్య యుద్ధాలు, ఉగ్రవాద దాడులు, ప్రకృతి వైపరీత్యాలు, యాక్సిడెంట్స్, అకాల మరణాలు మనలను భయాభ్రాంతులకు గురిచేసి ఆందోళనలు కలిగించవచ్చు. 31వ కీర్తనలో దావీదు తన జీవితంలో ఎదురైన పరిస్థితులను బట్టి నిస్పృహతో మొరపెట్టడం (14వ), కాలగతులు ఆయన వశములో నున్నవని (15వ) గుర్తించి సమాధానాన్ని అనుభవించడం గమనిస్తాము. నిజమే ఈ లోకంలో సంపూర్ణమైన భద్రత సాధ్యం కాదు. అయితే దావీదు యొక్క దేవుడే మన దేవుడు. పరిస్థితులు భయాందోళనలు కలిగించేవిగా ఉన్నప్పటికీ మనం దేవుని శాశ్వతమైన, విఫలం చెందని ప్రేమను పోగొట్టుకోము.

దేవునిపై మనకున్న విశ్వాసం మనలను లోకపు భయాల నుంచి విడిపిస్తుంది (కీర్తన 23:4). భయపడడం వల్ల మనుష్యులకు ఉరి వస్తుంది, యెహోవాయందు నమ్మిక యుంచువాడు సురక్షితంగా నుండును (సామె 29:25). చింత మొదలైన చోట విశ్వాసం అంతమవుతుంది, అలాగే విశ్వాసం మొదలైన చోట చింత అంతమవుతుంది.

### భయమా? విశ్వాసమా?

బైబిల్ రెండు రకాల భయాలను గూర్చి చెప్పింది.

1. పరిశుద్ధతలోకి, రక్షణలోకి నడిపించే భయం (2 కొరింథీ 7:1; ఫిలిప్పీ 2:12)
2. ఆందోళన, దిగులు, విభ్రాంతి కలిగించే భయం (కీర్త 91:5; లూకా 12:32)

మొదటిగా దేవునికి భయపడాలి (సన్మానించాలి, గౌరవించాలి). రెండవదిగా 'హెచ్చరిక' లాంటిదని తప్పుగా అర్థం చేసుకోకూడదు. మనం సాధారణంగా మరణం గూర్చి, భవిష్యత్‌ను గూర్చి, ఓటమి గూర్చి, బాధ్యతలను గూర్చి, ముసలితనం గూర్చి, అభద్రత గూర్చి, ఇతరులు ఏం చేస్తారో, ఏం అనుకొంటారో అనే భయాలు కలిగి ఉంటాము. కొన్నిసార్లు ఈ భయం దేవుని వాగ్దానాలను నమ్మకుండా లేదా మర్చిపోయేలా చేస్తుంది. దేవుని ఉద్దేశాలపై అపనమ్మకం కలిగేలా చేస్తుంది. దేవుని ప్రజలకు బలహీనతను, నిరుత్సాహాన్ని కలిగిస్తుంది.

కొంతమంది మరణం గురించి భయపడుతూ జీవించడానికి భయపడుతుంటారు. చాలినంత డబ్బులేదని భయపడుతూ వారికున్న డబ్బు పోగొట్టుకొంటామేమోనని భయపడుతుంటారు.

యవన దశలో స్వాతంత్ర్యం, అభద్రత మధ్య కొట్టుమిట్టాడుతూ ఆందోళన పడుతుంటారు. ప్రస్తుత రోజుల్లో విద్యార్థులు మునుపెన్నడూ లేనంతగా ఒత్తిడికి గురవుతున్నారు. అన్ని వర్గాల వారిని, అన్ని అంతస్తుల వారిని, అన్ని నేపథ్యాల వారిని భయం వెంటాడుతుంది. అందుకే భయం వాస్తవమైనది అని అనడంలో సందేహం లేదు. వాస్తవానికి భయం దేవునిపై మనకున్న విశ్వాసాన్ని అడ్డగిస్తుంది, భయం మన హృదయాలను, మనసులను దేవుని నమ్మడానికి, సవాళ్ళను ఎదుర్కోవడంలో తీవ్రతను తగ్గిస్తుంది.

దేవుడు మనతో ఉన్నాడని, ప్రతి విషయంలో మనకు సహాయం చేస్తాడనే గొప్ప ఇంద్రియ నిగ్రహాన్ని భయం దొంగిలించే ప్రమాదం ఉంది. దేవుడు మనకు శక్తిని, ప్రేమను, ఇంద్రియ నిగ్రహంగల ఆత్మనే ఇచ్చాడు గాని పిరికితనంగల ఆత్మనియ్యలేదని అపొస్తలుడైన పౌలు తిమోతిని హెచ్చరించాడు.

## భయాన్ని అధిగమించడానికి సలహాలు

1. భయం దుష్టుల లక్షణం గనుక తప్పక నిషేధించాలి. అందువలననే పరిశుద్ధ గ్రంథంలో చాలా సార్లు భయపడకుడి అని రాశారు (సామె28:1).
2. బెదిరింపులకు భయపడకుడి, కలవరపడకుడి, సమాధానము చెప్పుటకు సిద్ధంగా ఉండమని పేతురు చెప్పాడు (1 పేతురు 3:14,15).
3. విశ్వాసం భయానికి శత్రువు గనుక దేవునియందు విశ్వాసముంచుడి అని తెలియజేయబడింది (యెషయా 26:3).
4. దేవుడు తండ్రియనే నిర్ధారణ కలిగి ఉండాలి.
5. దేవుని సన్నిధి, కాపుదల మనతో ఉందనే విషయాన్ని ఎంతమాత్రం మర్చిపోకూడదు.
6. మీ భయాల గూర్చి ఎప్పుడూ ఆందోళన చెందవద్దు.
7. పాపం వలన వచ్చే భయం దేవుని నుంచి దూరమయ్యేలా చేస్తుంది (ఆది 3:10).
8. పాపంతో రాజీపడేలా చేస్తుంది (సామె 29:25).
9. అవిధేయతకు దారితీస్తుంది (ఆది 26:9; నిర్గమ 32:1-4).
10. భయం కేవలం జరిగే మంచి కార్యాలను అడ్డగిస్తుంది, చెడు కార్యాలకు నడిపిస్తుందని గుర్తు చేసుకోవాలి.

## భయంలో స్ఫూర్తి

ఓ ప్రక్క తన కుటుంబ బాధ్యత, పనిఒత్తిడి, రాజకీయ దురహంకారం, ఆర్థిక ఇబ్బందులు, పనిచేసే స్థలంలో హేళన, అణచివేత, మరోప్రక్క మత వ్యతిరేకంగా తన భర్తను అరెస్ట్‌చేయడం, తనకంటూ ఎవరూ బంధువులు, స్నేహితులు లేని పరిస్థితుల్లో "ఆలిస్" ఇది నావలననే అని ప్రభువు మాట్లాడినప్పుడు.. ఇది నీమూలంగానైతే, నీవు అనుమతించినట్లయితే నేనే మౌనంగా ఉంటాను, నేను భయపడను గానీ నీవు మాత్రం మమ్మల్ని కాపాడు, భద్రపరచు, మా కుటుంబంలో ఈ పరిస్థితిని బట్టి ఎవరూ నీ నామానికి ఎంతమాత్రం సిగ్గు, అవమానం కలుగకుండా జీవించేలా సహాయం చేయండి అని ప్రార్థించింది.

పాస్టర్ 'అలెన్' తన భార్య ఆలిస్ 1937సం॥ నుంచి చైనా దేశంలో ప్రభువును సేవించేవారు. కమ్యూనిస్టు భావాలుగల మిలటరీ సైన్యం నివసించే ప్రాంతంలో వీరు ఏర్పాటు చేసే టెంట్ మీటింగ్‌లో ఎందరో సువార్తను నమ్మి ప్రభువు చెంతకు వచ్చేవారు. కమ్యూనిస్టు వారు పాస్టర్ అలెన్‌ను మత ఛాందసవాదిగా ముద్రవేసి 1958లో తనతోపాటు మరో 11మందిని అరెస్ట్‌చేశారు. ఇంకేముంది తన కుటుంబ బాధ్యత భార్య 'ఆలిస్'పై పడింది. ఒకటికాదు, రెండుకాదు 21సం॥ల 8నెలలు తన భర్త జైల్లో ఉన్నప్పటికీ తన విశ్వాసాన్ని కోల్పోలేదు. తన కోసం ప్రాణంపెట్టిన ప్రభువు కోసం జీవించింది. ఆ కాలంలో ఆలిస్ ఉత్తరాలు రాసేటప్పుడు, ఆయన త్వరలో వస్తున్నారు గనుక మా దేశంలో అనేకులు క్రీస్తు కొరకు రాగలిగేలా ప్రార్థించండి. నా గురించి, నా ఆరోగ్యం, నా అవసరాల కోసం కాదు, అధికారుల నుంచి భద్రత కోసం కాదు అని తెలియజేసింది. ఆమె రాసిన ఉత్తరాలు ఎందరినో సవాలు చేసేవి.

## భయంలో భరోసా

నిజమే విశ్వాసం క్రైస్తవ జీవితంలో ఎంతో ప్రాముఖ్యమైనది. అయితే విశ్వాసం ఉన్న చోట భయం ఉండదు, భయం ఉన్న చోట 'విశ్వాసం సంపూర్ణం కాదు'. దేవుని సన్నిధి ప్రతి విధమైన

భయంనుంచి మనలను దూరం చేస్తుంది. ధైర్యమే విశ్వాసానికి గుర్తు, విశ్వాసం ముందుంటే ధైర్యం వెంబడిస్తుంది.. లోకపు ఒత్తిడిలు, అనేక రకాల ఆందోళనలు మన ధైర్యాన్ని, బలాన్ని దొంగిలించినా, ఆయన మీద ఆధారపడినప్పుడు, మన హృదయాలను, మనసును ఉత్తేజపరుస్తుంది, విశ్వాసాన్ని బలపరుస్తుంది, భయాలను తొలగిస్తుంది. ఆయన సంపూర్ణ ప్రణాళికలో అన్ని చక్కగానే అమర్చబడతాయి. ఆయన మార్గాలు మనకు, మన పరిమిత సామర్థ్యానికి అర్థం కావు, అంతుపట్టవు. ఆయన నిర్దేశాలు ఎప్పుడూ నిర్దిష్టమైనవి, వాక్యానుసారమైనవి, ఖచ్చితమైనవి, ప్రత్యేకమైనవని గ్రహించుదాం. ఆయన పిల్లలుగా ఆయన ఆజ్ఞలను పాటించినట్లయితే ఫలితాలు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. అనేకులు సవాలు చేయబడతారు, రక్షణపొందుతారు, విశ్వాసులు ఉజ్జీవింపబడతారు. అనుదిన జీవితంలో ఎదురయ్యే సమస్యలు, భయాల నుంచి విడిపించబడి భయాలను అధిగమిస్తూ ప్రభువు కోసం జీవించడానికి తీర్మానం చేసుకొందామా!

మనకు విశ్వాసం నేర్పించడానికి సమస్యల వైపు, ధైర్యం నేర్పించడానికి ఒంటరితనంలో ఓర్పును, సహనాన్ని నేర్పించడానికి దేవుడు శ్రమల వైపు మనలను నడిపిస్తాడు. అంతేగాని దేవుడు హృదయపూర్వకంగా విచారమునైననూ, బాధనైననూ కలుగజేయడని నమ్మాలి (విలాప 3:33). దేవుని పట్ల నిరీక్షణ ఉంటే శ్రమలలో కూడా అతిశయించగలం. నిరీక్షణ గలవారు దేనికీ ఆందోళన చెందరు, ఆవేశపడరు, అనవసరంగా చింతించరు. ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు (1 పేతురు 5:7). దేనిని గూర్చి చింతింపకుడి (ఫిలిప్పీ 4:6,7). దేవుడు పిరికితనం గల ఆత్మను మనకు ఇయ్యలేదని (2 తిమోతి 1:7) గుర్తుచేసుకొందాం.

కీర్తనాకారుడు నీ దుడ్డుకర్ర, నీ దండము నన్ను ఆదరించును (కీర్తన 23:4) అని చెప్పడంలో దుడ్డుకర్ర భద్రతకు, భరోసాకు, దండము విశ్రాంతికి, విడుదలకు అని గుర్తుచేసుకోవాలి. కాపరి దుడ్డుకర్రను గొర్రెల భద్రతకు, సంరక్షణకు వాడతాడు, ప్రతికూల పరిస్థితుల్లో తన శత్రువు దాడిచేసినప్పుడు, అపాయకర సమయాల్లో కాపరి తన దండముతో తన వాటిని ఆదరిస్తాడు. మనం కూడా యెహోవా నా కాపరి, నాకు లేమి కలుగదు అని వల్లించడమే కాకుండా అనుభవపూర్వకంగా గతంలో దేవుని దయగల కార్యాలను తలంచుకొంటూ, కనికరం చూపే తండ్రి, సమస్త ఆదరణను అనుగ్రహించు దేవుడు మనతో ఉన్నాడని ఎరిగి, ఆ ఆదరణతో ఎట్టి శ్రమలలో, భయాలలో ఉన్నవారినైననూ ఆదరించడానికి శక్తిగల వారమవ్వాలని పౌలు హెచ్చరికను గుర్తుచేసుకొందాం (2 కొరింథీ 1:3,4).

ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య పరిస్థితులు, రాజకీయ అస్థిరత, విశ్వాసాన్ని వ్యతిరేకించే, అడ్డగించే పరిస్థితులు, సువార్త ప్రకటించడానికి కళాశాలల్లో విద్యార్థుల పరిచర్యలో ఎన్నో ప్రతికూలతలు, సవాళ్ళు, కుటుంబ సంబంధాల్లో సమస్యలనే తుఫానులు ఎదురైనప్పుడు 'కోరిన రేవుకు' నడిపిస్తాడని, ఎండిన నేలను నీటి ఊటల చోటుగాను, అరణ్యమును నీటి మడుగుగాను, నదులను అడవిగాను, నీటి బుగ్గలను ఎండిన నేలగాను, సత్తువుగల భూమిని చవిటి పఱ్ఱగా మార్చగలడని నమ్ముదాం (కీర్తనలు 107:30,34,35).


## ముగింపు

ఒక్కోసారి మన జీవితంలో ప్రతికూల పరిస్థితులు, సమస్యలు ఎదురై అవిశ్వాసం, అనుమానంతో మనం నడిచే మార్గం కష్టంగా, భయంగా అనిపించినా వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి. అవి మనలో సహనాన్ని పెంపొందిస్తాయి. సమస్యల వలన ఎన్నడూ కృంగుబాటు కావడానికి ప్రయత్నించకూడదు. మన సహనం చివరి స్థాయికి వచ్చినప్పుడు మనం దేనికైనా సిద్ధంగా ఉంటాం. పూర్తిగా, పరిపూర్ణంగా గుణంలో గట్టిపడతాం. అందుకే సహనం అన్ని సుగుణాలకు రాణిలాంటిదని భయపడక సహించడం, ఓర్చుకోవడం ఎదిగిన విశ్వాసుల లక్షణం అంటారు. జీవితంలో తుఫానులను అనుభవించేటప్పుడు, గాఢాంధకారపు లోయలనే పరిస్థితుల గుండా వెళ్ళేటప్పుడు, విశ్వాసమనే గట్టితోడుతో నడుస్తున్నప్పుడు ఆయన శక్తితో నిశ్చలమైన విశ్వాసాన్ని మనం ప్రదర్శించవచ్చు. తద్వారా దేవుడు భయంలేని మన విశ్వాసపు నడకను, ఆయనపై నిరీక్షణను ఉంచడానికి ఇతరులను ప్రభావితం చేయడానికి దేవుడు మనలను వాడుకొంటాడు.

– డా. వి. ఇశ్రాయేలు రాజు, వైజాగ్

# స్వేచ్ఛనిచ్చే స్వచ్ఛత

**అపొ.కా. 5:1-11**



స్వచ్ఛమైన పాలు, స్వచ్ఛమైన నీళ్ళు, స్వచ్ఛమైన నూనె, స్వచ్ఛమైన ఆహారానికి మార్కెట్లో ఎంతో డిమాండ్ ఉన్న రోజులు ఇవి. దానికోసం ఎంత డబ్బు వెచ్చించడానికైనా ఎవరూ వెనకాడడం లేదు. శారీరక ఆరోగ్య కోసం అంత వెంపర్లాడుతుంటే, సహవాసంలో ఆధ్యాత్మిక ఆరోగ్యానికి స్వచ్ఛత లేదా పారదర్శకత మరెంత అవసరం. సహవాసంలోని ఒక్కరిలో ఈ పారదర్శకత లోపించినా వాతావరణం అంతా కలుషితం అయిపోతుంది. అదే జరిగింది ఆది సంఘంలో. అననీయ అంటే దేవుడు కృపగలవాడు, సప్పీర అంటే అందమైనది అనే అద్భుతమైన పేర్లు కల భార్యా భర్తలు ఆది సంఘం ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలుషితం చేయడానికి ప్రయత్నించారు. ఈ భాగంలో భార్యాభర్తలు, అననీయ, సప్పీరాల పారదర్శకతలేమి, వేషధారణ, మోసపు ఆలోచనలతో ఇద్దరికీ నష్టం తెచ్చిపెట్టుకొన్నారు. ఎంతో ఉదారులుగా, త్యాగపూరితులుగా కనపర్చుకోవడానికి ప్రయత్నించి వాళ్ళ పొలాన్ని అమ్మిన డబ్బులో కొంత దాచి పెట్టుకొని, సంఘానికి అంతా ఇచ్చి వేశామనే వేషధారణ వైఖరితో అందరిని మోసం చేయాలని ప్రయత్నించారు కానీ అది ఫలించలేదు.

ప్రేమతో ప్రార్థించి, ద్వేషంతో జీవిస్తూ మనం అప్పటికీ దేవునిని ఆరాధిస్తున్నాం అని భావిస్తాం' అని అంటాడు ఎ డబ్ల్యు టోజర్.

దేవుని గుణ లక్షణాలను లోతుగా అర్థం చేసుకోని, నమ్మని వ్యక్తులు ఇతరులను సులువుగా మోసం చేయగలమని భావిస్తారు. దేవునిని మోసం చేయడానికి ప్రయత్నిస్తే పర్యవసానాలు ఎంత తీవ్రంగా ఉంటాయో ఊహించుకోలేక పోయారు. సంఘానికి క్షేమాభివృద్ధి కలుగ చేయడానికి బదులు ప్రశాంత వాతావరణంలో అనవసరమైన భయాన్ని సృష్టించారు. స్వచ్ఛత లేని మనసు మనలను, మన కుటుంబాలను, సహవాసాన్ని ఎక్కువగా కలుషితం చేస్తుంది.

## ప్రశ్నలు

1. మనం మనకు సంబంధించిన ఏ విషయాలు ఇతరుల నుంచి దాచి పెట్టడానికి ప్రయత్నిస్తాం? ఎందుకు?
2. ఈ భాగంలోని భార్యాభర్తలు (అననీయ, సప్పీరా) సంఘానికి ధనం ఎందుకు ఇవ్వాలని భావించారు? (అపో .కా 4:32-35).
3. ఆది సంఘం అనుసరించిన విధానానికి, వీళ్ళు అనుసరించిన విధానానికి వ్యత్యాసం ఏంటి?
4. పేతురుకు ఈ సమాచారమంతా ఎలా తెలిసి ఉంటుందని భావిస్తున్నారు? అతడు అననీయకు అందించిన వివరాలు ఏంటి? (3-4 వ).
5. అంతిమంగా వాళ్ళు ఎవరిని మోసం చేయడానికి ప్రయత్నించారు? వాళ్ళు ఈ పాపం చేయడానికి ప్రేరేపించింది ఎవరు? (యోహాను 8:44) మన జీవితంలో ఇలాంటి అనుభవాలున్నాయా?
6. వాళ్ళు చేసిన పని, వాళ్ళ విశ్వాసంను బట్టి దేవుని పట్ల వాళ్ళు ఎలాంటి అవగాహన కలిగి ఉన్నారు? (3, 4 వ).
7. ఈ భార్యా భర్తలు మోసం చేయడంలో ఏకీభవించిన కారణాన అనుభవించిన పర్యవసానాలు ఏంటి? (5,10 వ). దేవుని తీర్పు మన జీవితాలలో ఎటువంటి మార్పును తీసుకొని రావాలి ?
8. పారదర్శకంగా లేకపోతే సహవాసానికి మనం తెచ్చే నష్టం ఏమిటి ?
9. ఈ సంఘటన కారణంగా అది సంఘంలో ఎటువంటి వాతావరణం ఏర్పడింది? (5,11 వ)
10. సహవాసంలో పారదర్శకంగా నేను ప్రవర్తించక పోవడానికి కారణం ఏంటి? ఇతరులు అలా ఉండ కుండా నా ప్రవర్తన కారణమా? ఆలోచిద్దాం.

- బి. మంజుల లాజరస్,
నేషనల్ రిటైర్డ్ స్టాఫ్, హైదరాబాద్



థియాలజీ

# విశ్వాస ప్రమాణాలు

లేఖనాలకు మన విశ్వాసం, ప్రవర్తన మీద సంపూర్ణ అధికారం ఉందనేది మన నమ్మకం. మనం నమ్మేది సత్యమేనా? అనేది సరిచూసుకోవాల్సిన అవసరం ఉంది. మొదటి రెండు శతాబ్దంల్లోనే అనేకమైన తప్పుడు సిద్ధాంతాలు పుట్టుకొచ్చాయి. వాటిల్లో, యేసు నరావతారి అని నమ్మని సిద్ధాంతం, పునరుత్థానం లేదని చెప్పే సద్దూకయ్యుల సిద్ధాంతం, రెండవ రాకడను గూర్చి పేతురు పత్రికలో చెప్పినదాన్ని తప్పుగా వక్రీకరించిన సిద్ధాంతం, శరీరంతో మనం ఏ పాపం చేసినప్పటికీ అది మన ఆత్మకు అంటదనే గ్రీకుల తప్పుడు సిద్ధాంతం మొదలైనవి.

వీటిని ఖండిస్తూ బైబిల్ ఒక విషయం లేక సత్యాన్ని గూర్చి సమగ్రంగా ఏమి బోధిస్తుందో అని తెలియజేస్తూ, క్రైస్తవ సిద్ధాంతాలను ఏర్పరచారు. వీటిని ప్రమాణాలు లేక విశ్వాస ప్రమాణాలు అన్నారు. ఇవి మనం నమ్మే క్రైస్తవ సత్యాలు లేక ప్రామాణిక సత్యాలు. వీటికి మన విశ్వాసంపై, ప్రవర్తనపై అధికారం ఉంది.

### 1. అపోస్తలుల విశ్వాస ప్రమాణం

అన్ని డినామినేషన్స్/సంఘాలు నమ్మే అతి పురాతనమైన క్రైస్తవ మూల సిద్ధాంతాలు లేక నమ్మకాలు ఇవి. దేవుడు సృష్టికర్త అని, ఆయన కుమారుడైన యేసుక్రీస్తు కన్య మరియకు జన్మించి, మరణించి, మూడవ దినాన పునరుత్థానుడై తిరిగి లేచి తండ్రి కుడిపార్శ్వమున కూర్చున్నాడని, ఈ లోకానికి తీర్పు తీరుస్తాడని, పరిశుద్ధాత్మని, సార్వత్రిక సంఘాన్ని, విశ్వాసుల సహవాసాన్ని, పాపక్షమాపణను, మృతుల పునరుత్థానాన్ని, నిత్యజీవాన్ని నమ్మడం.

### 2. నైసియన్ విశ్వాస ప్రమాణం

ఏరియనిజం తప్పుడు బోధకు వ్యతిరేకంగా ఏర్పడిన విశ్వాస ప్రమాణం. యేసుక్రీస్తు స్వయంభవుడు కాదు, యేసు క్రీస్తు తండ్రి చేత సృజించబడినవాడు అనే తప్పుడు సిద్ధాంతానికి వ్యతిరేకంగా ఈ విశ్వాస ప్రమాణం ఏర్పడింది. యేసు ఆది నుండి ఉన్నవాడు, స్వయంభవుడు, త్రిత్వంలో ఒక వ్యక్తి తండ్రితో సమానుడు, నిత్యుడు, తండ్రి లాంటివాడు అనేది ఈ విశ్వాస ప్రమాణం. ఆయన సృష్టికి తీర్పు తీరుస్తాడు, ఆయన రాజ్యానికి అంతం ఉండదు అనే నమ్మకం.

నైసియన్ విశ్వాస ప్రమాణం ఆ కాలం నాటి తప్పుడు బోధను ఎదిరిస్తూ త్రిత్వంలోని వ్యక్తుల భిన్నత్వం, సమానత్వం, ఏకత్వాన్ని దృఢంగా సమర్థించింది. అప్పుడు ఉన్న వక్ర భాష్యాలకు ధీటైన సమాధానాన్ని ఇచ్చింది.

### 3. అథినేషియన్ విశ్వాస ప్రమాణం

త్రిత్వ స్వభావాన్ని వివరించడానికి అప్పుడు ఉన్న తప్పుడు సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఇది ఉద్భవించింది. తండ్రి కుమార పరిశుద్ధాత్ములు ముగ్గురు భిన్నమైన వ్యక్తులు, వారు నిత్యులు, స్వయంభవులు, సృష్టింపబడని వారు, ఒకే సారం కలిగి ఏకమై ఉన్నారు. వారు ముగ్గురు కాదు, త్రియేక దేవుడుగా ఉన్నాడు.

### 4. కాల్సిడోనియన్ విశ్వాస ప్రమాణం

ఈ విశ్వాస ప్రమాణం యేసుక్రీస్తు యొక్క రెండు స్వభావాలను సమర్థించడానికి, వివరించడానికి ఏర్పడింది. యేసుక్రీస్తు పరిపూర్ణ దేవుడు, పరిపూర్ణ మానవుడు. ఈ రెండు స్వభావాలు గందరగోళం లేకుండా, మార్పు చెందకుండా, విభజించబడకుండా, వేరు పడకుండా ఒకే వ్యక్తిలో మిళితమై ఉన్నాయి. ఏకత్వం వల్ల ఈ రెండు స్వభావాలు భిన్నత కోల్పోవు గాని పరిరక్షించబడతాయి.

### 5. డిడాకే

దీనిని అపోస్తలుల బోధ అంటారు. ఆదిమ సంఘంలో ఇది పుట్టింది. విశ్వాస ప్రమాణం లాంటి స్వభావాన్ని కలిగి ఉంది. క్రైస్తవులకు ప్రాథమిక బోధ

కలిగి ఉంది. కొత్తగా క్రైస్తవ్యాన్ని అంగీకరించిన వారికి బాప్తీస్మం, ఉపవాసం లాంటి అభ్యాసాలను బోధిస్తుంది. ఈ బోధలో నాలుగు భాగాలు ఉన్నాయి. మొదటి భాగం వారిని బాప్తీస్మానికి సిద్ధపరచడానికి, వారి నైతిక ప్రవర్తన ఎలా ఉండాలో సిద్ధపరిచేది. బైబిల్లో చెప్పిన జీవ మార్గం, మరణ మార్గం ఉదహరించేది. రెండో భాగం ఆచార సాంప్రదాయాలకు సంబంధించింది. ఉదాహరణకు ఉపవాసం, రొట్టె విరుచుట, బాప్తీస్మం లాంటివి. ఆరాధన అభ్యాసాలకు, ఇది ఆత్మీయ అభ్యాసాలకు సంబంధించిన కరదీపిక లేక చిన్న పుస్తకం. మూడో భాగం ఆత్మీయ నాయకులకు, మతనాయకులకు సూచనలు చేసేది. నాలుగవ భాగం అంత్య దినాలలో సంభవించే వాటి మీద దృష్టి సారించేదిగా ఉంది.

## 6. యెరూషలేము బాప్తీస్మ ప్రమాణం

ఈ ప్రమాణం అన్ని ప్రమాణాలకు పూర్వమైనది. అప్పుడు ఉన్న తప్పుడు బోధలకు వ్యతిరేకంగా ఇది ఏర్పడి అపోస్తులుల విశ్వాస ప్రమాణాన్ని పోలి ఉంది. నేను త్రియేక దేవున్ని నమ్ముతున్నాను, పశ్చాత్తాపమును గూర్చిన బాప్తీస్మాన్ని నమ్ముతున్నాను అని చెప్పేదే ఈ విశ్వాస ప్రమాణం. బాప్తీస్మం తీసుకొనేటప్పుడు ఉత్సాహంగా చెప్పేదే ఈ ప్రమాణం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు బాప్తీస్మం తీసుకునేటప్పుడు హృదయంలో నుంచి పెల్లుభికే కేక ఇది.

## 7. వెస్ట్ మినిస్టర్ విశ్వాసపు ఒప్పకోలు

చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో ఉన్న కలహాన్ని లేక వివాదాన్ని పరిష్కరించడానికి ఏర్పడింది. దీని ఉద్దేశం ప్రతి ఒక్క క్రైస్తవున్ని ఇంగ్లీష్ ప్రొటెస్టెంట్ చర్చి కింద ఏకీకృతం చేయాలనేదే. ఈ ప్రక్రియలో స్కాట్లాండ్ కూడా ఉంది. అయితే ఇది ప్రెస్బిటేరియన్ల ఆధిక్యతలో ఉంది. ఇది ఇంగ్లాండ్‌లో ఉన్న సంఘాలను ఏకీకృతం చేయడానికి వాక్యాధార పత్రం. వాక్యంలో ఉన్న వేరువేరు అంశాలను అది నమ్ముతుందని వివరించింది. ప్రాముఖ్యంగా కాల్విడన్ ధృకృథమైన ముందుగా నిర్ణయించడం. ఈ అభివృద్ధి చాలా రఫ్‌గా జరిగింది. దీనికి గల కారణం స్కాట్‌రాజు అధికారంలోకి రావడం మరియు పోవడం. రాజు బలవంతంగా ప్రజలపై రుద్దాలనుకొన్న కొన్ని అభ్యాసాలను వారు తిరస్కరించడం. దాని ప్రాముఖ్య ఉద్దేశం నెరవేరనప్పటికి చిరకాలం గుర్తుండే ప్రభావాన్ని అది చూపి స్కాట్‌లాండ్ పురోగమనానికి దారి తీసిన క్రైస్తవ పునాదిరాయిగా మిగిలిపోయింది.

## 8. లండన్ బాప్టిస్ట్ విశ్వాసపు ఒప్పకోలు

అర్మేనియన్ సిద్ధాంతం ప్రబలడం, బాప్టిస్ట్ సంఘం చర్చ్ ఆఫ్ ఇంగ్లాండ్ చేత హింసించబడడం వల్ల ఈ విశ్వాసపు ఒప్పుకోలు ఉనికిలోకి వచ్చింది. ఈ విశ్వాసపు ఒప్పుకోలు పూర్తి రూపం 1689వ సంIIలో వచ్చినప్పటికీ 50 సంవత్సరాలకు ముందే దీనికి పునాది పడింది. ఈ సమయంలో సాధారణ బాప్టిస్టులు, ప్రత్యేక బాప్టిస్టులు అనే రెండు వర్గాలు ఏర్పడ్డాయి. ప్రత్యేక బాప్టిస్టులు సంస్కరించబడిన వారుగా, కేల్వనిస్ట్ బాప్టిస్టులుగా పరిగణించబడ్డారు. వీరి విశ్వాసపు ఒప్పుకోలు ఏంటంటే, మేము నిజమైన జీవము గల త్రియేక దేవుని నమ్ముచున్నాము. ఆయన అదృశ్యుడు, వ్యక్తి, సర్వశక్తుడు, సర్వవ్యామి, సర్వజ్ఞాని, నిత్యుడు, మార్పు లేనివాడు, సత్యవంతుడు, నీతిమంతుడు, పరిశుద్ధుడు, మంచివాడు, ప్రేమ గలవాడు, కరుణ గలవాడు, దీర్ఘశాంతుడు, కృపా సమృద్ధి గలవాడు. ఈ ఒప్పుకోలు బాప్టిస్ట్ సంఘాల ఎదుగుదలకు, ఏకం అవ్వడానికి సాధనమైంది.

## 9. ఆగ్స్‌బర్గ్ విశ్వాస ఒప్పకోలు

రోమన్ చక్రవర్తి చార్లెస్–5 క్రీ.శ.1520 ప్రాంతంలో కొన్ని మతపరమైన సమస్యలు తలెత్తుతాయని గ్రహించి పరిష్కారంకోసం సమావేశానికి పిలుపునిచ్చాడు.

ఈ ఒప్పుకోలులో 28 ఆర్టికల్స్ ఉన్నాయి. ఈ ఒప్పుకోలు రోమన్ క్యాథలిక్ చర్చ్‌కి, లూథరన్ చర్చ్‌కి గల పోలికలు, తేడాలు, సమాధాన పడడానికి గల అవకాశాలు గుర్తించడానికి ఒప్పుకోలులు విడుదల చేశారు. ఈ ఒప్పుకోలులో లూథరన్ సంఘం ఏవి నమ్ముతుంది, ఏది నమ్మదు అనే విషయాలు తెలియ చేయబడ్డాయి.

ఈ ఒప్పుకోలు దేవుని గుణ లక్షణాలు, క్రైస్తవ అభ్యాసాలు, సంఘ పరిపాలన, మానవ స్వేచ్ఛ, చిత్తం, మూల పాపం, దానికి కారణం, తుది తీర్పు మొదలైనవి. కేథలిక్ చర్చ్‌తో విభేదించేవి ఆరాధన, ప్రభురాత్రి భోజనం, మత గురువుల వివాహం, ఆశ్రమ ప్రతిజ్ఞలు మొదలైనవి ఉన్నాయి.

ఈ ఒప్పుకోలు పత్రం మిలాంగ్‌టన్ అనే వ్యక్తి మార్టిన్ లూథర్ మద్దతు, సహాయ సహకారాలతో

సమావేశంలో ప్రవేశపెట్టాడు. కొన్ని అనివార్య కారణాలవల్ల మార్టిన్ లూథర్ హాజరు కాలేదు. ఈ ఒప్పుకోలులోని లూథరన్ నమ్మకాలు బైబిల్‌కి వ్యతిరేకం కాదని చెప్పడానికి, అంతకు ముందు జరిగిన సంస్కరణను పునరుద్ధరించడానికి ఉపయోగపడింది.

రోమన్ క్యాథలిక్ సంఘాన్ని, లూథరన్ సంఘాన్ని సమాధానపరచడానికి చేసిన గొప్ప ప్రయత్నం ఇది. ఈ ఒప్పుకోలు ఆ సమావేశంపై గొప్ప ప్రభావం చూపింది. రోమన్ చక్రవర్తి అభీష్టానికి భిన్నంగా ఇది లూథరన్ సంఘంపై దాని ప్రభావాన్ని కొనసాగిస్తూ ఉంది.

## 10. కేనన్ ఆఫ్ డార్ట్

చారిత్రాత్మక యూరప్ సంఘం తప్పుడు బోధలకు, హింసకు వ్యతిరేకంగా చాలా ఒప్పుకోలులు, విశ్వాస ప్రమాణాలు ఉత్పత్తి చేసింది. అటువంటి మరొక డాక్యుమెంట్ కేనన్ ఆఫ్ డార్ట్. జర్మనీలోని సంస్కరించబడిన సంఘాలను ఏకీకృతం చేయడం దీని ఉద్దేశం. ఈ సమావేశానికి జర్మనీలో ఉన్న భిన్న సంఘాల నాయకుల బృందం కేనన్ (ప్రామాణికతను) రాసేందుకు కలిసి వచ్చారు. ఈ ప్రామాణికత మరేంటో కాదు మనకు తెలిసిన ఐదు పాయింట్ల కేల్వినిజం. వీరు ఆర్మీనియం దృక్పథాన్ని తిరస్కరిస్తూ ఐదు విషయాల కేల్వినిజాన్ని అంగీకరించారు. అవి ఈ క్రింది విధంగా ఉంటాయి. 1. షరతులు లేని ఎంపిక, 2. పరిమితి గల ప్రాయశ్చిత్తం, 3. మానవుని పూర్ణ అధోగతి, 4. నిరోధింపబడని కృప, 5. పరిశుద్ధుల భద్రత. ఈ ఐదు అంశాలు వారి సంఘాలకు ప్రామాణికంగా ఎంచబడి ప్రపంచమంతటా చెరగని ముద్ర వేశాయి.

## 11. బైబిల్ దోష రహితమని చెప్పే చికాగో ప్రకటన

మనం పైన చెప్పుకొన్న విశ్వాస ప్రమాణాలు, ఒప్పుకోలులు వందల సంవత్సరాల నుండి ఉన్న పత్రాలు. బైబిల్ దోష రహితమైనదని చెప్పే చికాగో ప్రకటన అత్యంత విలువైనది, ఎంతో ప్రాముఖ్యమైనది. 1978 సంవత్సరంలో దీన్ని ప్రకటించారు. ఈ ప్రకటన వేరువేరు సంఘాలు/ డినామినేషన్స్, సెమినరీస్, కళాశాల నుండి వచ్చిన 268 మంది ప్రతినిధుల చేత అంగీకరించబడి ఒక కాన్ఫరెన్స్‌లో తయారు చేయబడింది. క్రీ.శ. 1960లో బైబిల్ దోషరహితం అనే నమ్మకం నుండి సంఘాలు క్రమంగా తొలగిపోతుండడం వల్ల ఈ ప్రకటన చేయాల్సి వచ్చింది. ఈ ప్రకటన రెండు కోణాల నుండి సమస్యను పరిష్కరించింది. మొట్టమొదటిగా లేఖనాలు దేవుని చేత ప్రేరేపించబడ్డాయి. రెండవది లేఖనాలు లోప రహితాలు.

## 12. నేషవిల్లే ప్రకటన


క్రీ.శ. 2017లో ఇది రాయబడింది. జెండర్ మరియు లైంగిక విషయాలలో ఇవాంజిలికల్ స్టాండ్ తెలియచేయడానికి తయారు చేయబడింది. నేటి దినాలలో స్వలింగ సంపర్కం, నీవు జన్మించని జెండర్‌ను నీకు ఆపాదించుకోవడం లాంటివి జరుగుతున్నాయి. మనం అందర్నీ ప్రేమించాలి అనే ఉద్దేశంతో సంఘం కూడా ఈ విషయాలను సమర్థిస్తూ వచ్చింది. అయితే బైబిల్ ఈ విషయాలు పాపం అని చెబుతూ ఉంది.

బైబిల్ స్వలింగ సంపర్కం గూర్చి, మనం జన్మించని జెండర్‌ను మనకు ఆపాదించుకోవడం గూర్చి పాపమని చెబుతూ ఉంది. కాబట్టి నేషవిల్లే ప్రకటన ఇలాంటి విషయాలు, అభ్యాసాలు పాపమని, సంఘం వీటిని సమర్థించకూడదని, వీటికి మద్దతు ఇవ్వకూడదని తెలియచేస్తుంది. ఇది ఈ మధ్యనే తయారు చేయబడింది కాబట్టి అంత ప్రాచుర్యం పొందలేదు గాని ఇవాంజిలికల్ చర్చ్ యొక్క స్టాండ్‌ను స్పష్టం చేసి రాబోయే సంవత్సరాల్లో సంఘం దేవుని వాక్యానికి నమ్మకంగా కట్టుబడి ఉండడానికి సహాయపడింది.

## ముగింపు

ఈ విశ్వాస ప్రమాణాలు, ఒప్పుకోలులు మన విశ్వాస జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. ఈ విశ్వాస ప్రమాణాలు ముఖ్యంగా త్రిత్వం, యేసుక్రీస్తు, లేఖనాలు చుట్టూ తిరుగుతాయి. మనం ముఖ్యంగా అపొస్తలుల విశ్వాస ప్రమాణం, నైసియన్ విశ్వాస ప్రమాణం, అథినేషియస్ విశ్వాస ప్రమాణం, లండన్ బాప్టిస్ట్ ఒప్పుకోలు, చికాగో ప్రకటన, నేషవిల్లే ప్రకటన మన ఆత్మీయ జీవితాలకు, నమ్మకాలకు ప్రమాణాలు. మనం నమ్మేది సరైనదో కాదో చూసుకోవాల్సిన బాధ్యత మన మీద ఉంది. సత్యాన్ని గ్రహిద్దాం, నమ్ముదాం, స్వతంత్రులుగా జీవిద్దాం. లేకపోతే అబద్ధం మనల్ని బంధీలుగా చేస్తుంది.

– జి. జెర్మియా ప్రసాద్, ఏపి–ఇజియఫ్ స్టాఫ్, తుని



# క్రైస్తవ తత్వవేత్త
# జస్టిన్ మార్టిర్

యేసుక్రీస్తు ప్రభువు యొక్క అపొస్తలులు అందరూ చనిపోయిన తర్వాత క్రైస్తవ్యానికి ఒక నూతన శకం ఆరంభమయ్యింది. రోమా సామ్రాజ్యంలో విశ్వాసులు వర్ధిల్లి వ్యాపిస్తున్నప్పుడు వారు అనేక సవాళ్ళను, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది. అంతర్గతంగా ఉన్న విభేదాలు, ఆచారాలు, సంఘాన్ని కలవరపరుస్తున్నాయి. శారీరకంగా, మానసికంగా హింసలు పెరిగి చివరికి క్రైస్తవాన్ని వెలి వేశారు. దీనికి ముఖ్య కారణం ఏంటంటే, పల్లెటూరికి సంబంధించిన హెబ్రీ వ్యక్తియైన క్రీస్తును భక్తితో ఆరాధించడమే. రోమా చక్రవర్తిని దేవునిగా ఆరాధించడం లేదు కాబట్టి వీరిని దేశద్రోహులుగా ఎంచి సామూహికంగా ఉరి తీస్తున్న రోజులవి.

క్రైస్తవులు గ్రీకు-రోమన్ దేవతను పూజించడానికి నిరాకరించడాన్ని బట్టి నాస్తికులనే నెపాన్ని వారి మీద మోపారు. ప్రభురాత్రి భోజనాన్ని అపార్థం చేసుకొని క్రైస్తవుల్ని నరమాంస భక్షకులనేవారు. క్రైస్తవుల భక్తి సంబంధమైన కార్యక్రమాలు సహజంగా రహస్యంగాను, చీకటిలోను జరుగుతుండేవి, పైగా క్రైస్తవులు ఒకరిపట్ల ఒకరు మిక్కుటమైన ప్రేమను కనపరచడాన్ని బట్టి అపవిత్రులని నిందలు మోపారు. ప్రభుత్వ సేవకులుగా ఏదో ఒక సందర్భంలో విగ్రహ పూజ, బలులు అర్పించాల్సి వచ్చేది. గనుక క్రైస్తవులు ప్రభుత్వ ఉద్యోగాల నుంచి విరమణ పొందడం అనివార్యంగా భావించేవారు. అందుకని క్రైస్తవుల ను అసాంఘిక శక్తులుగా ముద్రించారు.

ఇటువంటి సమయంలో పాలస్తీనాలోని సమరియలోని పురాతన బైబిల్ నగరమైన షెకెము సమీపములోని ప్లావియా నియోపోలిస్ (నేడు నాబ్లస్)లోని ఒక అన్య కుటుంబంలో జన్మించాడు జస్టిన్ మార్టిర్ (క్రీ.శ. 100-క్రీ.శ 165). అతని చదువంతా ఎంతో అసంతృప్తిగా సాగింది. జస్టిన్ జ్ఞానానికి తగినట్లుగా ఉపాధ్యాయులు బోధించలేకపోయేవారు. స్టోయిక్‌లు, అర్టిస్టాట్ వాదులు, పైథాగరస్ వర్గానికి, ప్లాట్లో సంప్రదాయానికి చెందిన వారి దగ్గర తనకు వచ్చే సందేహాలను తీర్చుకోవడానికి ప్రయత్నించేవాడు. వీరంతా అన్య తాత్వికులు కాబట్టి వేర్వేరు సబ్జెక్ట్స్‌ను నేర్పించారు. వీటితోపాటు ఖగోళశాస్త్రం, గ్రీకు భాషల్లో ప్రసిద్ధుడయ్యాడు. నేర్పరియైన ఫిలాసఫర్‌గా పేరు గాంచినప్పటికీ అతనికి సంతోషం లేదు. ఈ సంతోష సమాధానాల కొరకు ఒంటరిగా కూర్చొని ఆలోచిస్తూ ఉండేవాడు.


ప్లాటో సిద్ధాంతం మార్టిర్‌పై కొంత ప్రభావం చూపించినప్పటికీ అది అతనికి సంతృప్తిని ఇవ్వలేక పోయింది. సంతోషం గూర్చి అన్వేషిస్తూ ఓ రోజు సముద్రతీరాన ఒంటరిగా నడుస్తున్నప్పుడు ఓ వృద్ధ క్రైస్తవుడు అతనిని కలిసి మాట్లాడడం ద్వారా తాను వెదుకుతున్న సత్య సిద్ధాంతాన్ని గుర్తించాడు. వెంటనే తన తత్వాన్ని వదిలి తన జీవిత విధానాన్ని, తన విద్యాభ్యాసాన్ని మార్చుకొని బైబిల్‌ని పరీక్షించడం ప్రారంభించాడు. ముష్కరులైన పాలకులు క్రైస్తవుల ను దారుణమైన హింసలు పెడుతుంటే క్రైస్తవులు కనబరిచిన వైఖరిని కళ్ళారా చూశాడు. తమ విశ్వాసం కోసం వాళ్ళు పొందిన వీరోచిత మరణాల ను చూశాడు. వారి భక్తి, నీతి, సత్ప్రవర్తన, ప్రేమ, ఆధ్యాత్మిక మరియు నైతికత ఎంతగానో ప్రభావితం చేశాయంటే క్రిస్టియానిటీకి మించిన ట్రూ ఫిలాసఫీ ఏదీలేదని జస్టిన్ గ్రహించాడు. దేవుని

వాక్యమందున్న సమాధానాన్ని, రక్షణను కనుగొని తన హృదయమందు క్రీస్తును రక్షకునిగా, దేవునిగా, ప్రభువుగా అంగీకరించి బాప్తీస్మం తీసుకొని తన జీవితాన్ని క్రీస్తు కొరకు అంకితం చేసుకొన్నాడు.

తర్వాత జస్టిన్ తత్వవేత్తల యొక్క అంగీని ధరించి రోమా పట్టణానికి ప్రయాణమైపోయి ఫిలాసఫర్స్ ఆచారం ప్రకారం సాంప్రదాయకంగా ఒక చిన్న పాఠశాలను స్థాపించాడు. ఇక్కడ బహిరంగ బోధను, వేదాంతాన్ని ప్రారంభించి ధైర్యంగా, బహిరంగంగా తన విశ్వాస్వాన్ని ప్రకటించుకొన్నాడు. తత్వశాస్త్రంలో, మత గ్రంథాలలో నిష్ణాతుడు కాబట్టి ఆయన ఎక్కడికి వెళ్ళినా అన్యతత్వాన్ని పెల్లగించి క్రైస్తవ సిద్ధాంతాన్ని సానుకూలంగా బోధిస్తూ క్రైస్తవ విశ్వాసాన్ని సమర్థించేవాడు. క్రిస్టియానిటీకి మించిన ట్రూ ఫిలాసఫీ ఏదీలేదని దేశమంతా పర్యటిస్తూ సువార్తను ప్రకటించేవాడు. స్వయాన నేర్పరియైన ఫిలాసఫర్ కాబట్టి ఆయన తన హేతు శక్తిని ఉపయోగించి క్రైస్తవ విశ్వాస గ్రంథాలను రాశాడు.

జస్టిన్ తన వాదనలను చక్రవర్తియైన ఆంటోనియస్ పైయస్‌కు, అతని కుమారుడైన మార్కస్ అరేలియస్‌కు, యూదుడైన ట్రైఫోకు ఒక సంభాషణ రాశాడు. ఈ వాదనలలో క్రైస్తవ్యానికి వ్యతిరేకంగా మోపబడిన నాస్తికత, అపవిత్రత అనే నిందలను ఖండించి క్రైస్తవులు నమ్మకస్తులని చూపించాడు. క్రీస్తు రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదని, క్రైస్తవ్యము మాత్రమే సత్యమును బోధిస్తుందని, ఈ రాజ్యము వారికి భయపడనవసరంలేదని చెప్పాడు. అతని వాదనలను, గ్రంథంలోని చివరి అధ్యాయాలలో బాప్తీస్మము, ప్రభురాత్రి భోజనము, విశ్వాసము, ఆచరణ మొదలగు వాటిలో తన 'ఒప్పుకోలు' రాశాడు. ఆ కాలంలో క్రైస్తవ విశ్వాసమును వివరించిన వారిలో జస్టిన్ ప్రథమునిగా ఉన్నాడు. క్రైస్తవ్యం కొత్తది కాదని, అది ప్రవచనాల నెరవేర్పని రుజువు చేయడానికి ప్రయత్నించాడు. ఈయన లోతైన విశ్వాసం, ధైర్యం, సమర్పణ కలిగిన క్రైస్తవుడు.

హృదయంలో క్రీస్తును విశ్వసించిన వారంతా బహిరంగంగా విశ్వాసాన్ని ప్రకటించుకోవాలనే విధానాన్ని ప్రవేశపెట్టాడు. తద్వారా పట్టణములోని చాలామందిని తనకు శత్రువులుగా చేసుకొన్నాడు. అతను తర్కించిన వారిలో క్రిసెన్ అనే వ్యక్తి జస్టిన్‌కు బద్ధశత్రువై కుట్రచేసి జస్టిన్‌ను అధికారులకు



అప్పగించినట్టు జస్టిన్ స్టూడెంట్ అయిన టాటియన్ చెప్పాడు.

జస్టిన్ మార్టిర్ అతని సహచరులను పట్టుకొని రోమా ప్రభుత్వ అధికారులైన జూలియస్ రస్టికస్ ముందు నిలవబెట్టినప్పుడు జస్టిన్ ఈ విధంగా సమాధానమిచ్చాడు. "మన రక్షకుడైన యేసుక్రీస్తు యొక్క కళంకములేని, ఖండించలేని ఆజ్ఞను పాటిస్తున్నాం". నీవు నమ్మే సిద్ధాంతం ఏంటని అడిగినప్పుడు "నాకు అన్ని సిద్ధాంతాలు తెలుసు కానీ నేను నమ్మే సిద్ధాంతం క్రైస్తవులకు సంబంధించినది"అని సమాధానమిచ్చాడు.

ఈ సంభాషణ ముగించేటప్పటికి జస్టిన్ రస్టికస్‌కి క్రైస్తవ సిద్ధాంత సారాంశం మొత్తాన్ని ధైర్యంగా వివరించాడు. నీవు, నీ సహచరులు ఎక్కడ కలుసుకొంటారని అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, "మీరు అక్కడకు రండి, సత్యాన్ని గూర్చిన సిద్ధాంతాన్ని మీకు పూర్తిగా బోధిస్తానని" జస్టిన్ అంటాడు. గొప్ప ఫిలాసఫరైన నీవు సత్యాన్ని ఎరిగాను అని అనుకొంటున్నావు, నిన్ను హింసించి, నీ తల నరికివేస్తే నీవు పరలోకానికి పోతావా? అన్నప్పుడు "అవును, నేను ఖచ్చితంగా విశ్వాస వీరునిగా దేవుని దగ్గరకు వెళ్ళి బహుమానాన్ని పొందుతానని" ధృఢ నిశ్చయంతో జవాబిచ్చాడు. అప్పుడు రోమా అధికారి ఇలా అన్నాడు. "నీవు, నీ సహచరులు ఇక్కడికి ఒకే మాటతో వచ్చారు, ఒకేసారి శిక్షింపబడతారా అని రక్టికస్ బెదిరించాడు. అప్పుడు జస్టిన్ "ఏ విశ్వాసి కూడా భక్తి నుండి భక్తిహీనతలోకి పడిపోడు, మీరు మమ్మల్ని ఎలా శిక్షించినా మేము మాత్రం విగ్రహాలకు బలి అర్పించము, చక్రవర్తి ఆజ్ఞను మేము సమర్థించలేమని" అన్నాడు. వెంటనే జస్టిన్‌ను దారుణంగా కొట్టి శిరచ్ఛేదనం చేస్తాడు. ఈ రీతిగా క్రీ.శ. 165లో హతసాక్షుడయ్యాడు జస్టిన్ మార్టిర్.

– కె. మార్త కొండలరావు, బొల్లాపల్లి

# కుటుంబంలో కష్టాలు



"మన జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్య దేవుని శక్తిని నిరూపించే ఒక గొప్ప అవకాశం. అయితే, మనం ప్రతిరోజూ లెక్కలేనన్ని బంగారు అవకాశాలను ఎదుర్కొంటూ వాటిని అధిగమించలేని వారంగా ఉంటున్నాం" అని అంటాడు ఛార్లెస్ స్విండాల్. మన కుటుంబాల్లో ఆరోగ్యం, ఉద్యోగం, ఆర్థిక విషయాల్లో సమస్యలను ఎదుర్కోవడం, ప్రియులను కోల్పోవడం లాంటి అనేక సమస్యలు, కష్టాలను ఎదుర్కొంటూ నిరాశ, నిస్పృహలకు లోనవుతూ, ఆవేదనతో ప్రభువుకు, పరిచర్యకు దూరమవుతున్నాం. అయితే కష్టాల్లో మన స్పందన ఎలా ఉండాలి? క్లిష్ట పరిస్థితులు సంభవించినా ప్రభువు బిడ్డలు దేవుని కోసం ఎలా నిలిచారో ఈ వ్యాసంలో చూద్దాం.

## యోబు ఆశీర్వాదం

యోబును గురించి దేవుడు యథార్థవర్తనుడు, న్యాయవంతుడు, దేవుని యందు భయభక్తులు గల వాడు, చెడుతనమును విసర్జించినవాడు మరియొకడు లేడని కితాబిచ్చాడు (యోబు 1:8). దేవుడు ఆయనకు ఆస్తి, ఆరోగ్యం, ఆనందం, మంచి కుటుంబం ఇచ్చాడు. ఆయనకు ఏడుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఎంతో ధనవంతుడు ఏడువేల గొర్రెలు, మూడు వేల ఒంటెలు కలిగి తూర్పు దిక్కున ఉన్న జనులందరిలో అతనే గొప్పవాడు.

యోబు ఇంత ధనవంతుడైనా, అతడు దేవుని భయం కలిగిన వాడు. బిడ్డలు ఒకవేళ పాపం చేసి ఉంటారేమోనని ప్రతి దినం దహన బలి అర్పించేవాడు. ఆయన జీవితం గూర్చి ఆలోచిస్తే ఆయన కంటే ఆశీర్వదించబడినవారు ఎవరూ లేరని అనిపిస్తుంది. ఆస్తి, అంతస్తు, సంతోషం, సమాధానం, దేవుని యెడల భయభక్తులు కలిగి అనేక మందికి ఆశీర్వాదంగా ఉన్నాడు.

మన జీవితాలలో కూడా దేవుని కృప, కాపుదలను అనేక పర్యాయాలు చూస్తుంటాం. మన ఆర్థిక వనరులు, ఆరోగ్యం దేవుని దగ్గర నుండి వచ్చేవే. మనం అనుభవించడం కేవలం దేవుని కృప వల్లే. నిజానికి అనేక లక్షల మంది కంటే మనం ఉన్నతమైన స్థితిలో ఉంచబడిన వారం. గనుక దేవునికి నిరంతరం మనం కృతజ్ఞత కలిగి ఉండాలి.

## యోబు ఆవేదన

యోబు ధనవంతుడు, యథార్థవంతుడు, దేవుని యెడల భక్తిపరుడు అయినా, ఆయన కుమారులు, కుమార్తెలు, గొర్రెలు, ఒంటెలు, ఎడ్లు అన్నీ ఒక్క రోజులోనే చనిపోయాయి. ఆయన ఆరోగ్యం కూడా పోయింది. భయంకరమైన దురద, శరీరాన్ని పెంకులతో గీస్తున్న పరిస్థితి. అయితే దేవుని దూషించలేదు. మనము దేవుని వలన మేలు అనుభవించెదమా? కీడును మనము అనుభవింపతగదా? అని ప్రశ్నించాడు. యెహోవా ఇచ్చెను, యెహోవా తీసుకొని పోయెను, ఆయన నామమునకే మహిమ కలుగును గాక! అని పలికిన యథార్థవంతుడు యోబు. తన ఆస్తి, ఆరోగ్యం అన్నిటి వెనుక దేవుని హస్తం ఉందని గ్రహించాడు. యథార్థతనే పరీక్షను నెగ్గాడు. చివరికి దేవుడు తను కోల్పోయిన సమస్తాన్ని తిరిగి ఇచ్చాడు.

## జీవితం అన్నిసార్లూ మనం అనుకున్నట్లు ఉండదు

కరోనా మన జీవితాన్ని ఎంత గడిబిడి చేసిందో చూశాం. చాలా కుటుంబాలు కృంగిపోయాయి. ఆర్థిక సంక్షోభం, ఆరోగ్యం కోల్పోయి ఒకరిని ఒకరు కలిసే అవకాశం లేక ఎంత మదనపడ్డామో చూశాం. సొంతవారు చనిపోతే కనీసం సమాధి చేయడానికి

కూడా నోచుకోలేదు. హాస్పటల్ వాళ్ళు ఉన్నదంతా దోచేసే మానవత్వం లేని ప్రజలను చూశాము. భయాన్ని కలుగజేసే అనుభవాలు, దు:ఖాన్ని మిగిల్చిన అనుభవాలు, ప్రభువా మా కుటుంబానికే ఎందుకు? నీ సేవలో ఉన్నాం కదా అన్న అనుమానాలు, ఎంత ఆలోచించినా సమాధానం దొరకని అయోమయం, ఆ గాయాలు ఇంకా కొన్ని కుటుంబాలను కోలు కోకుండా చేశాయంటే అతిశయోక్తి కాదు.

### బాధ, వేదన ఎవరికి ఇష్టం?

ప్రతి ఒక్కరూ సుఖాన్ని, సంతోషాన్ని కోరుకొంటారు, బాధను ఎవరు కోరుకుంటారు?

### పౌలు భక్తుడు

శ్రమ పడడం కూడా దేవుడు మనకు అనుగ్ర హించాడని అంటాడు (ఫిలిప్పీ 1:30). నిజానికి పౌలు చాలా సౌకర్యంతమైన స్థానంలో ఉన్నాడు. రోమా పౌరసత్వం కలిగి గమలీయేలు వద్ద ధర్మశాస్త్రం నేర్చుకొన్నాడు. గవర్నర్ అవ్వడానికి అర్హతలు కలిగిన వాడు.

దేవుడు దమస్కు మార్గంలో సంధించిన తర్వాత ఆయన జీవితం కష్టతరమైన మార్గంలోకి వెళ్ళింది. యేసుక్రీస్తును గూర్చిన సువార్త ప్రకటించాడు. అయితే దానిని బట్టి యూదులు అతనిని హింసించారు, చెరసాలలో వేసి, అపరిమితంగా దెబ్బలు కొట్టి. రాళ్లతో కొట్టి చనిపోయాడనుకొని ఈడ్చారు. ఆకలి, దిగంబరత్వం, ఉపవాసం అనేక రకాల శ్రమల్ని అనుభవించాడు (2 కొరింథీ 11:23-27).


### శ్రమల్లో పౌలు వైఖరి

పౌలుకు దేవుని యందు విశ్వాసం, సువార్త పట్ల భారం ఉన్నాయి. సువార్త ప్రకటించాల్సిన భారం తన మీద మోపబడియున్నదని సువార్త ప్రకటించకపోతే తనకు శ్రమ అన్న భావం కలిగిన వ్యక్తి. సువార్త ప్రకటించడం కోసం ఎంతకైనా తగ్గించుకోవడానికి సిద్ధపడ్డాడు.

క్రీస్తు ప్రేమ నుండి మనలను ఎడబాపు వాడెవడు? శ్రమయైనను, బాధయైనను, హింసయైనను, కరువైనను, వస్త్రహీనతయైనను, ఉపద్రవమైనను, ఖడ్గమైనను మనలను ఎడబాపునా? (రోమా 8:35) అని ప్రశ్నిస్తున్నాడు.

### పౌలు నిరీక్షణ

వెనకటివి మరిచి ముందున్న వాటికై వేగిరపడుచు,



క్రీస్తుయేసునందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని గురి యొద్దకే పరిగెత్తుచున్నాను (ఫిలిప్పీ 3:13-14).

నేనే స్థితిలో ఉన్నను ఆ స్థితిలో సంతృప్తి కలిగి ఉండ నేర్చుకొనియున్నాను. పౌలు దీనస్థితిలో, సంపన్న స్థితిలో, కడుపు నిండిన స్థితిలో, ఆకలిగా ఉన్న స్థితిలో, సమృద్ధి, లేమి ఇలా అన్ని విషయాల్లో దేవునికి నమ్మకంగా ఉంటూ ఆయన కార్యాలు చేయడంలో ఆసక్తిగా ఉన్నాడు. అందుకని “నన్ను బలపరచు వానియందే నేను సమస్తమును చేయగల ను” అన్నాడు.

ప్రభువును నమ్మిన పౌలు భూమిపైన జీవించే జీవితం అశాశ్వతమైనదని గమనించాడు. తనతో పాటు పరలోక రాజ్యానికి వచ్చేది కేవలం తాను ప్రభువు కోసం జీవించి, దేవుని కోసం చేసిన కార్యాలు మాత్రమే అని గ్రహించాడు. కష్టాలలో ఉన్న అనేక మందిని ఆదరించాడు. వారిని పరలోక వారసులు గా చేయడమే దేవుడు తనకు ఇచ్చిన బాధ్యతగా గుర్తించాడు.

మన జీవితాలను గురించి ఆలోచిద్దాం. పౌలు దేవుని కొరకు పడినన్ని కష్టాలు మనం పడ్డామా? ఈ ప్రశ్నకు చాలావరకు లేదు అనే సమాధానం వస్తుంది. మరి అన్ని శ్రమల్లో కూడా పౌలు దేవుని కొరకు జీవించిన జీవితం మనకు ఆదర్శంగా ఉండాలి.

### మన జీవితంలో కష్టాలు

దేవుడు తన బిడ్డలకు అనుమతించే ప్రతి దాని వెనుక ఒక ఉద్దేశం ఉంటుంది.

ఆకలి, ఆర్థిక లేమిలో ఉంటే – అటువంటి వారి బాధను అర్థం చేసుకోవడానికి

### ఒక భక్తుని ప్రార్థన, దేవుని జవాబు

నేను బలంగా ఉండాలని దేవునిని అడిగితే
దేవుడు కష్టాలను ఇచ్చి దాన్ని బలంగా
ఎదుర్కోమన్నాడు

నాకు జ్ఞానం కావాలి దేవా అంటే
సమస్యలిచ్చి వాటిని జ్ఞానంతో
అధిగమించమన్నాడు

నాకు ధైర్యం కావాలి దేవా అంటే
ప్రమాదాల నిచ్చి వాటిని ధైర్యంతో
ఎదుర్కోమన్నాడు

నాకు ప్రేమ కావాలి ప్రభువా అంటే
కష్టాలలో ఉన్న నిర్భాగ్యులను చూపి వారిని
ప్రేమించమన్నాడు

నాకు సహాయం కావాలి దేవా అంటే
సహాయాలు చేసే అవకాశం దేవుడిచ్చాడు

నేను అడిగింది నాకు దొరకలేదు కానీ
నాకు అవసరమైనది దొరికింది.

మన ప్రియులను కోల్పోతే – అటువంటి వారి మానసిక స్థితిని అర్థం చేసుకోవడానికి, వారిపై సానుభూతి చూపించడానికి

ఆరోగ్యం కోల్పోతే – అనారోగ్యంతో ఉన్నవారిని ఆదరించడానికి

ఆర్థిక సంక్షోభంలో ఉంటే – ఇతరుల కష్టాన్ని అర్థం చేసుకోవడానికి అర్థమవుతుంది

నాది నాది అని వేలాడే వాళ్ళకి – ఒకరోజు దానిని వదిలి వెళ్ళాలని అర్థమవుతుంది.

దేవుని ప్రేమించు వారికి అనగా ఆయన సంకల్పం చొప్పున పిలవబడిన వారికి మేలు కలుగుటకై సమ-స్తము సమకూడి జరుగుచున్నవి (రోమా 8:28).

### కష్టాలలో మనం ఏం చేయాలి?

కష్టం వైపు చూసి కృంగిపోవద్దు. దేవుని వైపు చూసి ధైర్యంగా ఉండాలి. దేవుని ఉద్దేశం తెలుసుకోవాలి. కష్టం కలకాలం ఉండదు. వాటి నుండి నేర్చుకునే అనుభవాలు అనేక మందిని అర్థం చేసుకోవడానికి, ఆదరించడానికి సహాయపడాలి. ఇతరుల కన్నీటిని, కష్టాలను అర్థం చేసుకోవడానికి నీ కన్నీటి అనుభవాన్ని ఉపయోగించు. నేను, నా అనే పరిధిలో నుండి బయటికి రా.

పౌలు, యోబు వంటి భక్తుల జీవితాలు ఆదర్శం కావాలి. కష్టాలలో కూడా పౌలు సువార్త ప్రకటించడం మనకు సవాలుగా అవ్వాలి. పౌలును జైల్లో పెడితే కాపలా ఉన్న సైనికులకు సువార్త చెప్పాడు. బెత్తాలతో కొట్టి బొండాలతో కాళ్ళు బిగించినప్పుడు దేవుని స్తుతించి ఫిలిప్పీ పట్టణంలో సంఘం ఆరంభించడానికి కారణమయ్యాడు. ఆయనకు వచ్చిన కష్టాలన్నీ దేవునిని మహిమ పరిచే విధంగా మలుచుకొన్నాడు. ఆయన హృదయ స్పందన సువార్తే. సువార్తను ప్రకటించడానికి సిగ్గుపడువాడను కాను, సువార్త ప్రకటించవలసిన భారం నాపై మోపబడి ఉన్నది. ఏ విధము చేతనైనను ఒకని రక్షించవలెనని అందరికీ అన్ని విధముల వాడినైతిని అని చెబుతాడు. కష్టాల్లో సేవ చేశాడు, అది దేవుని పిలుపని గ్రహించాడు.

### ముగింపు

కష్టాలు, నష్టాలు వచ్చాయని, మన ప్రియులను, ఆరోగ్యాన్ని కోల్పోయామని దేవుడు మనకు ఇచ్చిన పనిని వదిలిపెడదామా? లేక పౌలువలె సంతోషంగా చేద్దామా? దేవుని పరిచర్య చేస్తేనే మనకు సంతోషం, ధైర్యం, సంతృప్తి. గనుక ఎలాంటి పరిస్థితిలోనైనా దేవుని చిత్తాన్ని నెరవేర్చే వారంగా ఉందాం.

యిర్మియా ప్రవక్త అనేక కష్టాలు అనుభవించాడు. ఆయనను అన్యాయంగా హింసించారు. ఈ కష్టాలను తలచుకొని దేవుని పేరు ఎత్తకూడదన్నారు. అయితే అది తన హృదయం ముందు అగ్ని వలే మండింది. దేవుని గురించి చెప్పకుండా ఉండలేకపోయాడు (యిర్మియా 20:9).

ప్రియులారా, కష్టాలు మనకొక్కరికే కాదు క్రీస్తునందు సద్భక్తితో బ్రతకనుద్దేశించి వారికి శ్రమలు వస్తాయి (1 కొరింథీ 10:12-13). తాను నిలుచున్నానని తలంచుకొను వాడు పడకుండా జాగ్రత్తగా చూచుకొనవలెను. సాధారణంగా మనుషులకు కలుగు శోధన తప్ప మరి ఏదీ మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు. మీరు సహింపగలిగిన దానికంటే ఎక్కువగా ఆయన మిమ్మల్ని శోధింపనియ్యడు. అంతేకాదు సహింపగలుగుటకు ఆయన శోధనతో పాటు తప్పించుకొనే మార్గము కూడా కలగజేయును.

– యం జయనేంద్ర కుమార్, గుడివాడ




# నేను చాలా బిజీ

'నాకు అస్సలు టైమ్ లేదు' అని చాలా మంది విశ్వాసులు చెబుతుంటారు. 'నిజంగా అంత బిజీగా పనిచేస్తున్నారా?' అనేది ఆలోచించాల్సిన విషయం. "బిజీగా ఉండడం మాత్రమే సరిపోదు. దేని కొరకు బిజీగా ఉన్నారన్నదే ప్రశ్న" అని హెన్రీ డేవిడ్ థోరియన్ అంటాడు. అనేకమంది ఈ ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వలేరు. ఎందుకంటే వారికే తెలియదు కాబట్టి.

మహాత్మాగాంధీ, నెల్సన్ మండేలా, మదర్‌థెరిస్సా, అలెగ్జాండర్ ది గ్రేట్, అశోకుడు, విలియమ్ కేరీ, పండిత రమాబాయి వంటి వారు జీవితంలో ఎంతో సాధించారు. మన తరంలో కూడా భక్త్‌సింగ్, ప్రొ. ఇనాక్, సత్కీర్తి రావు, పి.సి. వర్గీస్, డా॥ సరళా ఎలీషా, దేవరాజు, డా॥ దేవపాల్ ... లాంటి వారు గొప్పగా సాధించడం కళ్ళారా చూశాము. కొంతమంది గొప్పగా ఏమీ సాధించకపోయినప్పటికీ ఎప్పుడూ బిజీగా ఉన్నట్లు బిల్డప్ ఇస్తుంటారు. బహుశా వారు దేవుడు చేయవద్దన్న పని చేస్తున్నారేమో! వీరికి సమయాన్ని సమర్థవంతంగా, ఫలవంతంగా ఉపయోగించుకోవడం తెలియదు.

*'నీవేమి చేయాలని దేవుడు ఆశిస్తున్నాడో అవన్నీ చేయడానికి సరిపోయినంత సమయం నీకుంది. తగినంత సమయం లేదంటే దేవుడు నిన్ను వద్దన్న పనులు చేస్తున్నావని అర్థం'*

– రోలాండ్ క్రౌషర్

## సమయము

'టైమ్'అనే మాటకు డిక్షనరీలో దాదాపు 30 అర్థాలు ఉన్నాయి. వాటిలో కొన్ని – కాలం, వేళ, సమయం, అవకాశం, వ్యవధి, యుగం, వెచ్చించదగిన సమయం, సందర్భం. దేవుడు ప్రతి ఒక్కరిని ప్రత్యేకంగా నిర్మించినప్పటికీ అందరికీ సమానంగా ఒక రోజులో గంటలు, నిమిషాలు, సెకండ్లు, వారంలో రోజులు, సంవత్సరంలో నెలలు, వారాలు ఇచ్చాడు. మన పనులు చేసుకోవటానికి ఏ ఒక్కరికీ అదనంగా సమయం ఇవ్వలేదు. మన కోర్కెలకి, అవసరాలకు అనుగుణంగా కాలం మారదు. సమయం దేవుడిచ్చిన ఒక గొప్ప వనరు, బహుమానం. కాలం ఎవరి కొరకు ఆగదు. నిరంతరం ముందుకు కొనసాగుతుండేది.

## సమయ నిర్వహణ అనగా?

మన దైనందిన జీవితంలో దేవుని కొరకు, వ్యక్తిగత అవసరాలకు, కుటుంబం కొరకు, చదువు లేక ఉద్యోగము, దేవుని బిడ్డలతో సహవాసం చేయడానికి, ఇతరుల కొరకు, విశ్రాంతి ఇంకా వినోదం మొదలైన వాటన్నింటికి సమయం అవసరం. ఈ బాధ్యతలన్నీ సమర్థవంతంగా నెరవేర్చేలా అత్యంత విలువైన మన సమయాన్ని ఉత్తమంగా ఉపయోగించుకోవడమే సమయ నిర్వహణ. ఎక్కువ సంతోషంగా, ఫలభరితంగా, విజయవంతంగా ఉండటానికి ఇది ఒక మార్గం. అంటే మన సమయాన్ని అర్థవంతంగా గడపడమే సమయ నిర్వహణ. దేవుడు మనకు అప్పగించిన పనులు నిర్వహించడానికి అవసరమైన సమయాన్ని ఆయన మనకు అనుగ్రహిస్తాడు. (ఫిలి 4:19)

## సమయ నిర్వహణ అనగా స్వయం నిర్వహణ

### సమయ నిర్వహణ – ఆవశ్యకత

"సమయమనగా జీవితం, అది మార్చలేనిది, దేనితోను భర్తీ చేయలేనిది. సమయాన్ని వ్యర్థం చేయడమంటే నీ జీవితాన్ని వ్యర్థం చేయడమే. నీ

సమయాన్ని నియంత్రించడమంటే నీ జీవితాన్ని నియంత్రించుకొంటూ గరిష్ట ప్రయోజనాన్ని పొందడమే" అని ఎలన్ లకీన్ గారంటారు.

ఈ భూమి మీద మనం జీవించే కాలం బహు స్వల్పం. కాబట్టి తక్కువ సమయంలో ఎక్కువ పనిని ప్రభావవంతంగా చేయాలన్నా, జీవితంలో అనుకొన్నది సాధించాలన్నా, ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నా సమయాన్ని సద్వినియోగం చేసుకోడం చాలా అవసరం. విజయాలను సాధించిన ఎవరి కథ చూసినా ఇది స్పష్టమవుతుంది.

యోహాను 9:4 ప్రకారం మన సమయాన్ని సరిగా వినియోగించుకొంటే, మన జీవితాన్ని చక్కగా వినియోగించుకొన్నట్లే. మన బాధ్యతలు, జీవితంలో ఎదురయ్యే ఒత్తిళ్ళు, ఇంకా అనేక విషయాలు మన సమయాన్ని అల్పమైన ప్రాపంచిక విషయాలలో వెచ్చించే విధంగా లాగుతుంటాయి. ఈ ప్రయత్నంలో నిత్యత్వపు విలువలను విస్మరించే ప్రమాదముంది. కాబట్టి మన దృష్టిని ప్రాముఖ్యమైన వాటిమీద కేంద్రీకరించడానికి సరైన ప్రాధాన్యతలు, గురులు కలిగి ఉండడంతోపాటు సమయ నిర్వహణ కూడా చాలా అవసరం. మోషేకి తన మామ ఇత్రో ఇచ్చిన అమూల్యమైన సలహా ఇదే (నిర్గ 18:13-22).

### దేవుని వాక్యంలో సమయ నిర్వహణ

దేవుడు తన పనిని ఆరు దినాలలో ముగించి ఏడవ దినాన విశ్రాంతి తీసుకొన్నాడు. ఈ విధమైన పని, విశ్రాంతుల నిష్పత్తి మన సమయాన్ని వెచ్చించే విషయంలో సృష్టికర్తయైన దేవుని తలంపుల ను తెలియజేస్తుంది. గనుక ముందుగా దేవునితో మనము అనుదినం గడిపే సమయాన్ని షెడ్యూల్ చేసుకోవాలి. దేవుడిచ్చిన పనులను చేసేందుకు సన్నద్ధం చేసేది, మన దినాలను నిర్దేశించేది ఆయనే. అనేకసార్లు సమయం మన స్వంతమనుకొని దాన్ని నిర్వహించాలని ప్రయత్నిస్తుంటాం. కానీ సమయం దేవుడు మనకిచ్చిన ఒక వనరు, మనం గృహనిర్వాహకులము మాత్రమే. కాబట్టి సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి తగిన జ్ఞానమిమ్మని దేవుని వేడుకొంటూ, ఆయన చేసే దిద్దుబాట్లకు లోబడుతూ, విశ్వాసంతో కొనసాగాలి.

దేవుడు మనకు జీవితాన్నే కాదు, ఆనందించటానికి సమయాన్ని కూడా ఇచ్చాడు. అంతేకాక ఇంతటి విలువైన దానిని వినియోగించుకోవడానికి అవసరమైన మార్గదర్శకాలను కూడా ఇచ్చాడు. మోషే కీర్తన 90:12లో 'మాకు జ్ఞానహృదయము కలుగునట్లుగా చేయుము. మా దినములు లెక్కించుటకు మాకు నేర్పుము' అని ప్రార్థించాడు. నిత్యత్వపు దృష్టికోణంలో ప్రతి దినము జీవించడానికి అవసరమైన జ్ఞానం కొరకైన మంచి మార్గమిది. సృష్టికర్తయైన దేవుడు శాశ్వతకాల జ్ఞానమును మన హృదయాలలో ఉంచాడు (ప్రసం 3:11). కాబట్టి సమయం విషయంలో మనం దేవునికి లెక్క అప్పగించాలనే బాధ్యత, సమయాన్ని సద్వినియోగం చేసుకోవటానికి మనకు పురికొల్పుగా ఉండాలి. అందుకే సి.యస్. లూయిస్ "ఈ తరానికి ఎంతో సేవ చేసిన వారంతా భవిష్యత్ గురించి ఎక్కువగా ఆలోచించిన వారేనని చరిత్ర చెబుతుంది" అంటాడు.

పౌలు ఎఫెసీయులకు "దినములు చెడ్డవి గనుక, మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలె కాక, జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి." అని హెచ్చరిస్తున్నాడు (5:15-16). ఇక్కడ జ్ఞానుల వలె జీవించడం అంటే సమయాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవడం అని అర్థం. లూకా 10:2లో చెప్పినట్లు కోత విస్తారంగా ఉంది కానీ పనివారు కొద్దిమందనే గ్రహింపు, కాలము త్వరగా గతిస్తుందనే స్పృహ ఉన్నప్పుడు మన మాట, మాదిరి ప్రవర్తనలతో క్రీస్తు కొరకు సాక్షులుగా జీవించే విధంగా మన సమయాన్ని సద్వినియోగం చేసుకొంటాము. ఇతరుల ను క్రియతోను, సత్యముతోను ప్రేమించేందుకు మన సమయాన్ని వెచ్చించాలి (1 యోహా 3:17-18).

### సమయ నిర్వహణకు కొన్ని సూచనలు

సమయ నిర్వహణ పట్టుదల, క్రమశిక్షణలతో ప్రయత్నిస్తేనే సాధ్యపడుతుంది. ఈ ప్రయత్నంలో మొదటి మెట్టు. ప్రస్తుత సమయ వినియోగాన్ని విశ్లేషించుకోవడం. సమయాన్ని ఎక్కడ, ఎప్పుడు, ఎలా వృధా చేస్తున్నామో తెలుసుకొనేందుకు, వ్యక్తిత్వపు లయ అర్థంచేసుకొనేందుకు ఇది అవసరం. ప్రతి ఒక్కరికి వారి వ్యక్తిత్వాన్ని బట్టి ఒక రోజులోనే కొన్ని ఎత్తు పల్లాలు ఉంటాయి. అంటే కొన్ని సమయాలలో శక్తివంతంగా, స్పష్టంగా, సృజనాత్మకంగా ఆలోచిస్తూ, ఎక్కువ ఫలభరితంగా ఉంటాం. కొన్ని సమయాలలో దీనికి పూర్తి భిన్నంగా, మరికొన్నిసార్లు మధ్యస్థంగా

ఉంటాం. ఈ విషయాలను చిత్రీకరించే గ్రాఫ్‌నే వ్యక్తిత్వపు లయ అంటారు. ఇది అర్థం చేసుకొంటే మన పనులను ప్లాన్ చేసుకోవడం తేలికవుతుంది.

- ❖ సమయాన్ని సద్వినియోగం చేసుకొనేందుకు దేవుని సహాయాన్ని కోరుతూ, ప్రతి దినాన్ని ప్రార్థనతో ప్రారంభించాలి.
- ❖ శ్రేష్ఠమైన వాటిని వివేచించి (ఫిలి 1:9-10), వాటిని సాధించేందుకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక గురి/గురులు ఏర్పరచుకోవాలి.
- ❖ చేయాల్సిన పనుల జాబితా రాసుకొని, నాలుగు రకాలుగా వాటిని వర్గీకరించుకొని ముఖ్యము, అర్జంటైన వాటిని వెంటనే చేయాలి. ముఖ్యమైనవి, అర్జంట్ కానివాటిని కొంత కాలం వాయిదా వేయవచ్చు. ముఖ్యం కాని అర్జంటైన వాటిని ఇతరులకు అప్పగించవచ్చు. ముఖ్యము, అర్జంట్ కాని వాటిని మర్చిపోవచ్చు.
- ❖ పనుల జాబితాను ప్రాధాన్యతల ప్రకారం తిరిగి రాసుకొని, స్థూల, సూక్ష్మ (స్వల్పకాలిక, దైనందిన) ప్రణాళికలు తయారు చేసుకోవాలి. ప్లానింగ్‌కి కేటాయించే సమయం వృధా కాదు. వాయిదా వేయకుండా పనులను ప్రారంభించాలి. ప్రణాళిక ప్రకారం పనిచేస్తూ, అవరోధాలు వచ్చినప్పుడు అవసరాన్ని బట్టి ఫ్లెక్సిబుల్‌గా ఉండాలి.
- ❖ కాలాన్ని వ్యర్థపరిచే వాటిని వదలివేసి సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి (కొలస్సీ 4:5).

*"నిమిషాన్ని సంరక్షిస్తే చాలు గంటలు తమ సంరక్షణ తాము చూసుకొంటాయి"* - చెస్టర్ ఫీల్డ్

- ❖ అవసరమైనప్పుడు పనులను వేరే వారికి అప్పగించడం (డెలిగేషన్) వలన పని ఒత్తిడి తగ్గడమే గాక తర్వాతి తరం నాయకులు తయారవుతారు.
- ❖ సమస్యల మీద కాక అవకాశాల మీద దృష్టి కేంద్రీకరిస్తూ, క్లిష్ట సమస్యలను పరిష్కరించడం నేర్చుకోవాలి (1 సమూ 30:8).
- ❖ ఒక్కసారి ఒక్క పనినే ఏకాగ్రతతో చేయాలి. మధ్యలో విరామం తీసుకొని సేదదీరడం మంచిది.
- ❖ అప్పుడప్పుడు సమయ విశ్లేషణ చేసుకొంటూ నీ సమయ నిర్వహణ ఎలా ఉందో సమీక్ష చేసుకోవాలి.

యేసు ప్రభువు బిజీగా ఉన్నారు కానీ తొందర పడలేదు. తొందరపడి నడుచువాడు దారి తప్పిపోవును. సామె 19:2

వయసు పెరిగే కొద్ది సమయం త్వరగా అయిపోతున్నట్లు అనిపిస్తుంది, వాస్తవమేంటంటే సమయం ఎంత విలువైనదో గ్రహిస్తున్నామన్నమాట. భూమి మీద మన కాలం కేవలము 70 సంవత్సరాలు, అధిక బలముంటే 80 సంll (కీర్త 90:10). రక్షణపొందిన వెంటనే దేవుడు మనల్ని తనతో తీసుకొని వెళ్ళకపోవటానికి కారణం ఈ లోకంలో మనం చేయవలసిన పని ఉందని అర్థం. కాబట్టి మనమెల్లప్పుడు మరణానికి లేక క్రీస్తు రాకడ కొరకు కనిపెట్టే వారంగా ఉంటూ ప్రణాళికాబద్ధంగా మన ప్రాధాన్యతలను ఏర్పరచుకోవాలి.

## ముగింపు

సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం గురించి, ఎఫెసీయులకు రాసిన పత్రిక 5:15-17 పై ప్రసంగిస్తూ రెవ. ఛార్లెస్ సీట్ గారు ఇద్దరు సహోదరీల గురించి చెప్పారు. ఆస్ట్రేలియాలోని ఒక రిటైర్మెంట్ హోమ్‌లో నివసిస్తున్న 70 సంవత్సరాల సహోదరి తన స్నేహితులుకు, దూర ప్రాంతాలలో పరిచర్య చేస్తున్న మిషనరీలను ప్రోత్సహిస్తూ ఉత్తరాలు రాయడంలో తన సమయాన్ని వెచ్చించేది. ఒక మిషనరీ తన పరిచర్యను విజయవంతంగా జరిగించడానికి కారణం, బలహీనురాలై తన గదికే పరిమితమైన ఒక ఆంటీ ప్రార్థనలే అని సాక్ష్యమిచ్చారు. ఆయన సంఘంలోని మరొక వయసు మళ్ళిన సహోదరి ఉల్లాసభరితమైన పద్యాలు రాసి, స్నేహితుల సహాయంతో వాటిని టైప్ చేసి, చిత్రీకరించి వాటిని కాపీలు తీసి అందరికీ పంచి పెట్టేదట. అవి అనేకమందికి ప్రోత్సాహకరంగా ఉండేవి.

ఈ విధంగా వయసుతో, పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరం, దేవుని చిత్తాన్నెరిగి, నిబద్ధతతో దేవుడు మనకిచ్చిన సమయాన్ని సద్వినియోగం చేసుకొంటూ, మంచి గృహనిర్వాహకులుగా ఉంటే రాబోయే దినాలలో మన పరిచర్యలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తామనడంలో అతిశయోక్తి లేదు. ఆ విధంగా ఉండేందుకు దేవుడు మనందరికీ సహాయము చేయును గాక!

**- వి. గౌరీ కుమారి,** తెనాలి




# పిచ్చుకగూడు

ఆనంద్ చాలాసేపట్నుంచి పక్కమీద అటూ ఇటూ దొర్లుతున్నాడు గానీ నిద్రమాత్రం పట్టడం లేదు. శరీరం మంచం మీద వాలింది గానీ మనసు మాత్రం ఇంకా గాల్లో పల్టీలు కొడుతూనే ఉంది. శరీరాన్ని పడుకోబెట్టినంత ఈజీ కాదు మనసును నిద్రపుచ్చడం.

పక్కనే ఇద్దరు పిల్లలు పూలతీగెల్లా వాళ్ళమ్మను అల్లుకుపోయి పడుకొని ఉన్నారు. ముగ్గురూ ఆదమరచి నిద్రపోతున్నారు. ఉదయాన త్వరగా లేచి స్కూల్‌కి రెడీ అవ్వాలి. అందుకే తొమ్మిది గంటలకల్లా మంచి నిద్రలోకి జారుకుంటారు.

పిల్లల్ని పెద్దవాళ్ళను చేయడానికి కొన్ని విషయాల్లో పెద్దలు కూడా పిల్లలుగా మారిపోవాల్సివస్తుంది. ఆ పని వాళ్ళమ్మ ఎంతో సహజంగా చేస్తుంది. పిల్లలతోబాటు ఆడుకోవడం, ఆ తరువాత హోంవర్క్, వాళ్ళతోనే భోజనం, వాళ్ళతోనే నిద్ర. అందులో గొప్ప ఆనందం ఉంది. అయితే ఎక్కువశాతం ఆ ఆనందాన్ని అమ్మలు మాత్రమే అనుభవిస్తూ ఉంటారు.

హాల్లోని గడియారం పదకొండు సార్లు మోగింది. బెడ్‌రూమ్‌లోకి శబ్దం లీలగా అయినా స్పష్టంగా వినబడింది. లోకమంతా నిద్దుర సంబరాల్లో మునిగిపోయి ఉంటే తనొక్కడే ఒంటరి గంటల్ని లెక్కపెడుతున్నట్లు అనిపించింది.

నిన్న సడెన్‌గా తన చేతికొచ్చిన ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ ఆనంద్ మనసులోని అలజడికి కారణం. తను లీడ్ చేస్తున్న ప్రాజెక్ట్ పూర్తికాకుండానే తనను ఇంకో డివిజన్‌కి ట్రాన్స్‌ఫర్ చేయడాన్ని అసలు జీర్ణించుకోలేక పోతున్నాడు.

సరిగ్గా సమయానికి బాస్ ఊర్లో లేడు. ఫోన్‌చేస్తే "అన్ని విషయాలు తర్వాత మాట్లాడుకొందాం. ముందు ప్రవీణ్‌కి ఛార్జ్ హ్యాండోవర్ చేసెయ్" అని ఫోన్ పెట్టేశాడు.

ఉన్నట్టుండి తనను ప్రాజెక్ట్ లీడ్ పొజిషన్ నుండి ఎందుకు తప్పిస్తున్నారో అర్థం కావడం లేదు. ఈ ప్రాజెక్ట్ సక్సెస్‌ఫుల్‌గా పూర్తయితే తన ప్రొఫైల్‌కి ఖచ్చితంగా వ్యాల్యూ పెరుగుతుంది. ప్రమోషన్ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

ఆనంద్‌లో చిన్నపాటి సునామీ చెలరేగుతుంది. "ఇదంతా ఒక ప్లాన్ ప్రకారం జరుగుతుందా? ఎన్నడూ మాట్లాడని విధంగా బాస్ ఇవాళ ఫోన్‌లో చాలా ముభావంగా మాట్లాడాడు. అతనికి ఇదంతా ముందే తెలుసా? తనకు అన్యాయం జరుగుతుందా? తన కెరీర్‌కి బ్రేక్ పడబోతుందా? దేవుడు ఇదంతా చూస్తూనే ఉన్నాడా?"

పగలంతా ఇంటి పనితో, సాయంత్రం పిల్లలతో అలసిపోయిన శ్రీమతితో ఈ విషయాలు ఎలా చర్చించాలో అర్థం కాలేదు. ఒకవేళ చెప్పినా జీతమేమీ తగ్గలేదు కదా! అని తేలిగ్గా తీసిపారవేస్తుంది. పిల్లల చదువులకూ, వాళ్ళ భవిష్యత్‌కూ ఇబ్బంది రాకుండా సరిపడా జీతమొచ్చినంతవరకూ తను ఏ కంపెనీలో పని చేసినా, ఏ పొజిషన్లో ఉన్నా ఆవిడకు ఇబ్బందే లేదు.

నిజానికి తనుకూడా జీవితాన్ని అంత సింపుల్‌గా తీసుకోగలిగితే బాగుండునని చాలాసార్లు అనుకొన్నాడు ఆనంద్. అదే తనవల్ల కావడంలేదు.

తెలియని బాధ మనసంతా కమ్మేసినట్లయింది. ఏసి రూమ్ అయినా ఊపిరాడకుండా ఎవరో తనను బంధించినట్లుగా అనిపించింది.

*******

నెమ్మదిగా పక్కమీదనుంచి లేచి బెడ్‌రూమ్ తలుపు తీసుకొని బాల్కనీలోకి వెళ్ళాడు ఆనంద్. బాల్కనీ గ్రిల్‌లోంచి బయటకు చూస్తూ నిలబడ్డాడు. నాలుగో అంతస్తులోంచి బయటకు చూస్తోంటే అటు ఆకాశానికీ, ఇటు భూమికీ చెందని ఫీలింగ్.

బయట రాత్రి తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తుంది. నల్లటి జెండాలు పట్టుకొని రాత్రి మేఘాలు చీకటి వేడుకలు జరుపుకొంటున్నట్లుగా ఉంది. అక్కడక్కడా ఆరిపోతూ వెలుగుతున్న వీధి దీపాలు పెళ్ళిలో సిగ్గుపడుతూ తిరుగుతున్న అమ్మాయిల్లా ఉన్నాయి.

అనుకోకుండా ఆనంద్ దృష్టి బాల్కనీ గ్రిల్‌కి వేలాడుతున్న పిచ్చుక గూడుమీద పడింది. చూడ్డానికి పెద్దదిగానే ఉంది. కానీ ఇన్నాళ్ళూ ఇదిక్కడ ఉన్నట్టే తను గమనించలేదేమిటా? అని ఆశ్చర్యపోయాడు. కొంచెం దగ్గరగా వెళ్ళి పరిశీలనగా చూశాడు. గూట్లోకి వెళ్ళడానికి వీలుగా ఒక ప్రవేశ ద్వారం లాంటిది కనబడింది. కొంచెం కిందకి వంగి ఆ ద్వారం లోంచి లోపలికి చూసి ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యాడు.

ఆ పిచ్చుక గూట్లోని దృశ్యం చూసి నిశ్చేష్టుడుగా నిలబడిపోయాడు. గూటిలోపలిభాగం ఓ గొప్ప రాజప్రసాదంలా ఉంది. గూటి మధ్యలో పైనుంచి వేలాడుతున్న తెల్లటి ముత్యంలాంటి వస్తువు గూడంతా తెల్లటి కాంతుల్ని విరజిమ్ముతుంది.

అద్భుతంగా అమర్చిన ఫర్నిచర్‌తో గూడు మొత్తం ఎవరో శిల్పకారుడు తీర్చిదిద్దిన కళాఖండంలా ఉంది. చూస్తున్న కొద్దీ తనో కొత్త ప్రపంచంలోకి అడుగుపెడుతున్నట్లు అనిపించింది. పిచ్చుకల కోసమే తయారు చేసినట్లు అన్ని వస్తువులూ చిన్నవిగా, అందంగా చూడముచ్చటగా ఉన్నాయి.

విశాలమైన గదిలో ఒక పక్కగా ఉన్న మంచం మీద ఓ చిన్న పిచ్చుక గోడకు నడుంవాల్చి కూర్చొని ఉంది. పెద్దది తల్లిపిచ్చుకనీ, చిన్నది పిల్ల పిచ్చుకనీ చూడగానే అర్థమైపోయింది. పిల్ల పిచ్చుక కాలికి ఏదో గాయమైనట్లు కట్టుకట్టి ఉంది.

ఈ పిచ్చుకలు మనం సాధారణంగా బయట చూసే పిచ్చుకల్లా లేవు. తోకకీ రెక్కలకీ తెల్లగా మెరిసిపోతున్న ఈకలు ఉన్నాయి. పిచ్చుకల్లోనే మరో జాతికి చెందినవై ఉండొచ్చు. బహుశా వేరే ప్రాంతం నుంచి వచ్చి ఇక్కడ గూడు కట్టుకుంటున్నాయేమో!

"మందురాసి కట్టు కట్టాను కదమ్మా, త్వరగా మానిపోతుంది, నువ్వు కాసేపు రెస్ట్‌తీసుకో" తల్లి పిచ్చుక పిల్ల పిచ్చుకతో అంటున్న మాటలు విని ఆనంద్‌కు మతిపోయింది. ఇదేంటీ, ఈ పిచ్చుకలు మనుషుల భాష మాట్లాడుతున్నాయా? లేక వాటి భాష తనకర్థమౌతోందా? కొంచెం అయోమయంగా తోచింది. అద్భుతంగా ఉన్న వాటి మాటలూ కదలికలూ చూసి మంత్రముగ్ధుడిలా ఉండిపోయాడు.

"రేపు అందరూ కొండలమీద విహారానికి వెళ్తున్నారు. ఈ కాలు విరగడం వల్లేకదా, నేను ఇంట్లోనే ఉండిపోవాల్సి వస్తోంది? గాయం మానిపోయినా నీ కాలు వంకరగా ఉండి పోతుంది. జీవితాంతం కుంటుతూనే నడవాల్సివస్తుంది. నీకసలు జీవితంలో పెళ్ళే అవ్వదు? అని మాఫ్రెండ్సంతా నన్ను ఎంత ఎగతాళి చేస్తున్నారో తెలుసా?" పిల్ల పిచ్చుక కళ్ళలోంచి ముత్యపు బిందువుల్లా కన్నీళ్ళు రాలిపడ్డాయి.

తల్లి పిచ్చుక మాట్లాడేలోపు మళ్ళీ పిల్ల పిచ్చుకే అంది, "అయినా ఇదంతా నాకే ఎందుకు జరగాలి? నేను సంతోషంగా ఉండటం దేవునికి ఇష్టం లేదా? అసలీ కష్టాలన్నీ ఎందుకొస్తాయి?"

తల్లి పిచ్చుక అనునయిస్తూ చెప్పింది "మనం కష్టపడుతుంటే చూడటం దేవునికిష్టం ఉండదు, కానీ కష్టాలకు సరైన విధంగా స్పందిస్తే వాటి ద్వారా మనకు మేలు జరిగే అవకాశం ఉంది".

అర్థం కానట్లు చూసింది పిల్ల పిచ్చుక..

పక్కనే చిన్నటేబుల్ మీద కళ్ళు మిరుమిట్లుగొలిపేలా వెలుగులు జిమ్ముతున్న చిన్న బైబిల్‌ని చేతిలోకి తీసుకొంటూ తల్లి పిచ్చుక గొంతు సవరించుకుంది.

"మనకు ఎదురయ్యే విపత్కర పరిస్థితుల వల్ల కనీసం మూడు ప్రయోజనాలున్నాయి". తల్లిపిచ్చుక చెప్పడం కొనసాగించింది.

**"మొదటిది,** కష్టాలు మన పునాదుల్ని బహిర్గతం చేస్తాయి. మత్తయి సువార్త ఏడో అధ్యాయం చివర్లో జీసస్ చెప్పిందిదే. గాలి, తుఫాను వచ్చినప్పుడు మన పునాదులెంత బలంగా ఉన్నాయో అర్థమౌతుంది. మన నమ్మకాల్నీ, విలువల్నీ దేవుని వాక్యమ్మీద కట్టుకొన్నామా? లేదా అనే విషయం తేలిపోతుంది"

కష్టసమయాల్లోనే మన అసలు స్వరూపం మన ముందుకొస్తుంది. కష్టాలు మనల్ని మనకు పరిచయం చేస్తాయి. మన వ్యక్తిత్వాన్ని సవాలు చేస్తాయి. కష్టాలు మన మానసిక స్థైర్యాన్ని త్రాసులో వేసి తూస్తాయి. మన ఆలోచనా ధోరణిలోని బలహీనతల్ని బయటపెడతాయి. ఆ విధంగా మన పునాదుల్ని మరమ్మత్తు చేసుకోవడానికి మళ్ళీ ఓ మంచి అవకాశాన్ని మనకు కల్పిస్తాయి.

పిల్ల పిచ్చుక శ్రద్ధగా వింటోంది. ఆనంద్ కూడా పెద్ద పిచ్చుక చెబుతున్న విషయాల్ని ఆసక్తిగా వింటున్నాడు.

**"రెండోది,** కష్టాలు మనల్ని పై తరగతిలోకి ప్రమోట్ చేసే పరీక్షలు. కష్టాలు మనల్ని పరిపూర్ణ వ్యక్తులుగా మారుస్తాయి. మనలో ఓర్పునూ సహనాన్ని పెంచుతాయి. చిరునవ్వుతో వాటిని అధిగమించినప్పుడు మన వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దుతాయి. యాకోబు పత్రిక మొదటి అధ్యాయం, పేతురు మొదటి పత్రిక, మొదటి అధ్యాయం ఈ విషయాన్నే మనకు బోధిస్తాయి.

"క్రైస్తవ జీవితం కష్టాలకు అతీతం కాదు. అవి మన విశ్వాసాన్ని పరీక్షించి మనల్ని స్వచ్ఛమైన బంగారంలా మార్చడానికి దేవుడు అనుమతించిన తాత్కాలిక పరిస్థితులు. అందుకే కష్టాలు ఎదురైనప్పుడు దిగులు పడాల్సిన అవసరంలేదు. దేవుణ్ణీ, మనుషుల్నీ నిందించకూడదు".

"దేవుడు మనుషుల్ని లోతైన జలాల్లోకి తీసుకెళ్తాడు. వారిని ముంచెయ్యడానికి కాదు, పవిత్రపరచడానికి"

పెద్ద పిచ్చుక వైపు కన్నార్పకుండా చూస్తూ దాని మాటల్లో లీనమైపోయాడు ఆనంద్. ఇదంతా తన పరిస్థితికి అతికినట్లు సరిపోయినట్లుంది. పిల్ల పిచ్చుక సంగతేమోగానీ తనకు మాత్రం ఎంతో ఊరట కలుగుతున్నట్లుగా ఉంది.

తల్లిపిచ్చుక మాత్రం అలా చెప్పుకొంటూ పోతూ ఉంది.

"ఇక కష్టాలవల్ల మనకొచ్చే **మూడో** ప్రయోజనమేంటంటే, కష్టాల్లో ఉన్న ఇతరుల్ని ఓదార్చడానికి అవి మనకు అర్హతను తీసుకొస్తాయి. కొరింథీయులకు వ్రాసిన రెండో పత్రిక మొదటి అధ్యాయంలో పౌలు ఇదే విషయాన్ని అద్భుతంగా ఆవిష్కరించాడు."

"కష్టాల కొలిమిలోంచి మనం విజేతలుగా ఆవిర్భవించినప్పుడు ఇతరుల కష్టాలను అర్థంచేసుకొనే ఓర్పూ, వారిని ఓదార్చే నేర్పూ మనకలవడతాయి. మనం ఇతరుల పరిస్థితుల్లోకి పరకాయ ప్రవేశం చేయగలుగుతాం. వాళ్ళ దృష్టితో సమస్యను చూడగలుగుతాం. వారి పక్కనే ఓ ఆసరాగా నిలబడగలుగుతాం. అలాంటి ఆసరాకోసం ఈ ప్రపంచంలో ఎంతోమంది ఎదురుచూస్తున్నారు".

"దేవుని శక్తిమీద ఆధారపడుతూ, కష్టాలను అధిగమిస్తూ మనం ముందుకు సాగుతున్నప్పుడు, మన విశ్వాసమే కాదు, మన చుట్టూ ఉన్నవారి విశ్వాసం కూడా అభివృద్ధి చెందుతుంది.

********

"ఏమండీ, ఇవ్వాళ ఆఫీసుకెళ్ళరా? ఏంటీ, ఇంకా పడుకొనే ఉన్నారు? టైమెంతయిందో తెలుసా? లేవండి, లేవండి..." శ్రీమతి కేకలతో ఒక్కసారిగా మెలకువ వచ్చింది ఆనంద్‌కి.

"అవునూ, మన బాల్కనీలో పిచ్చుకలు గూడెప్పుడు పెట్టాయి?" కళ్ళు నలుముకుంటూ అడిగాడు.

"ఏ పిచ్చుక గూడండీ, మన బాల్కనీలో ఎక్కడుందీ? గూడూలేదూ పాడూలేదు. కలగాని ఏమైనా వచ్చిందా?" దుప్పటి మడతపెడుతూ నవ్వుతోంది శ్రీమతి.

గబగబా లేచి బాల్కనీలోకి వెళ్ళిచూశాడు ఆనంద్. నిజమే ... అక్కడ ఏ పిచ్చుక గూడూ లేదు. అంతా కలే అని అర్థమైపోయింది. గ్రిల్ వైపే చూస్తూ కాసేపు నిలుచుండిపోయాడు. అద్భుతమైన ఆ పిచ్చుకగూడు కలలా కరిగిపోయినా, ఆ గూట్లోంచి వచ్చిన సందేశం మాత్రం అతని మనసులో శాశ్వతంగా నిలిచిపోయింది.

తల్లిపిచ్చుక చెప్పిన విషయాలు మళ్ళీ ఒకసారి గుర్తుచేసుకొంటూ ఆఫీస్‌కు రెడీ అవడం మొదలు పెట్టాడు.

**– డా. తాళ్ళూరి ప్రసాద్**



# భయం

**దేవుని ఉద్దేశాన్ని గ్రహించకుండా చేస్తుంది**

మన జీవితంలో భయం, ఆందోళన, చింత కలిగించే శారీరక అసౌకర్యాన్ని తొలగించడం యేసు ప్రాథమిక లక్ష్యం కాదు. మన హృదయాలలో, నమ్మకాలలో, ఆలోచనలలో ఏమి జరుగుతుందో దానిని బట్టే మన భావోద్వేగాలు ప్రతిబింబిస్తాయని యేసు క్రీస్తు మనకు బోధించాడు (యోహాను 14:1; మత్తయి 6:31-34)

## భయం అంటే?

భయం అనేది సాధారణ మానవ భావోద్వేగాలలో ఒకటి. సమీప, భవిష్యత్‌లో ఉన్న ప్రమాదానికి ఒక బలమైన మానసిక ప్రతిస్పందన. అది నిజమైనది కావచ్చు, ఊహించుకొన్నది కావచ్చు. సాధారణమైనది కావచ్చు, అసాధారణమైనది కావచ్చు, సహేతుకమైనది కావచ్చు, నిర్హేతుకమైనది కావచ్చు. భయం అనేది మనల్ని దయనీయంగా మార్చడానికి, మన జీవితాలను నాశనం చేయడానికి సాతానుడు మనకు వ్యతిరేకంగా ఉపయోగించే ఒక సాధనం. భయం మనకు వ్యతిరేకంగా ఎలా పని చేస్తుందో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. లేకపోతే అది దేవుడు మనల్ని సృష్టించినట్లుగా మారకుండా, మన జీవితంలో దేవుని ఉద్దేశాన్ని గ్రహించకుండా చేస్తుంది.

## భయం ఫలితాలు

భయం ఒక ఆలోచనగా ప్రారంభమై, తర్వాత మనల్ని పాలించే భావోద్వేగాలను సృష్టిస్తుంది. మన శరీరం భయం యొక్క భావోద్వేగానికి ప్రతిస్పందించినప్పుడు మనకు ఆందోళన కలుగుతుంది. చింత అనేది ఆలోచనా ప్రక్రియ, ఇది మన భయానికి సంబంధించిన విషయానికి శక్తిని ఇస్తుంది. భయం, ఆందోళన, చింత మన శారీరక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి, అవి మన ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని కూడా ప్రతిబింబిస్తాయి.

## రెండు రకాల భయాలు

అందుకు మోషే - భయపడకుడి; మిమ్మును పరీక్షించుటకును, మీరు పాపము చేయకుండునట్లు ఆయన భయము మీకు కలుగుటకును, దేవుడు వేంచేసెనని ప్రజలతో చెప్పెను (నిర్గమ. 20:20). మరియు ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడిగాని, ఆత్మను దేహమును కూడా నరకములో నశింపజేయగలవానికి మిక్కిలి భయపడుడి (మత్త. 10:28).

మొదటిరకమైన భయము హాని కలిగిస్తుంది, ఇది 2 తిమోతి 1:7లో ప్రస్తావించబడిన “భయపు ఆత్మ”. ఇది భౌతిక సంబంధమైన విషయాలకు సంబంధించింది కనుక దీనిని అధిగమించాలి.రెండవ రకమైన భయము ప్రయోజనకరమైనది, ఇది దేవుని యందలి భయం. ఇది ఆత్మీయ విషయాలకు సంబంధించింది కాబట్టి దీనిని ప్రోత్సహించాలి.

## భయానికి మూలమెక్కడ?

భయము అనే మాట ఏదేను తోటలో ప్రారంభమైనది. ఇది భౌతిక సంబంధమైన విషయాలకు సంబంధించిన భయము. (ఆది. 3:10)

**సాతానుడు కలిగించే భయం భౌతిక జీవితం మీద ప్రభావితం చూపిస్తుంది, కానీ దేవుని భయం భౌతిక, ఆధ్యాత్మిక జీవితాల మీద ప్రభావితం చూపిస్తుంది.**

1. భయానికి మూలం సాతాను. భయానికి మార్గం ఒంటరి తనం, మాధ్యమం మనలోని అత్యాశలే.
2. భయం అనేది విశ్వాసానికి వ్యతిరేకం. మనం విశ్వాసంతో నడవాలని దేవుడు కోరుకొంటే, మనం భయంతో నడవాలని సాతాను కోరుకొంటున్నాడు.
3. భయము అనేది మన దృష్టిని దేవుని వైపునుంచి మన వైపునకు మరలుస్తుంది (ఆది 3:7).
4. భయము అనేది దేవునితో సహవాసానికి దూరంగాను సృష్టితో సహవాసానికి దగ్గరగా చేస్తుంది (ఆది 3:8).
5. భయము అనేది దేవుని యొక్క మంచిని చెడుగా చూపిస్తుంది (ఆది 3:13).
6. భయము అనేది ప్రశాంతత నుండి ప్రయాస లోనికి మనలను నడిపిస్తుంది (ఆది 3:17).
7. భయము అనేది మనలను అనుకూల పరిస్థితులనుండి ప్రతికూల పరిస్థితులకు నడిపిస్తుంది (ఆది 3:18).

## మనలను భయానికి గురి చేసే విషయాలు

మరణ భయం (కీర్తన 55:4), శత్రువు భయం (కీర్తన 61:4), భవిష్యత్‌ను గూర్చిన భయం (దానియేలు 2:29; మత్తయి 6:34), మన బలహీనతల భయం (నిర్గమ 4:10), ఒంటరి తనం లేదా చిన్న గుంపు అనే భయం (1 రాజులు 19:14; లూకా 12:32), భూతకాల చెడు క్రియల భయం (ఆది. 50:15), సమాజము యొక్క భయం (లూకా 1:34).

## భయాల నుండి తప్పించుకోవాలంటే?

ప్రేమ భయాన్ని వెళ్ళగొడుతుంది (1 యోహాను 4:18), విశ్వాసము మన హృదయాలను కలవరపడకుండా చేస్తుంది (యోహాను 14:1), పునరుత్థానానికి సంబంధించిన నిరీక్షణ ధైర్యంగా సాక్ష్యమిచ్చేటట్లు దోహదము చేస్తుంది (అపో. 4:2,13).

ప్రార్థన, దేవుని వాక్యము, విశ్వాసుల సహవాసం వలన మనము భయాలన్నిటి నుంచి తప్పించబడతాము, మనకు నెమ్మది కలుగుతుంది, ధైర్యముగా దేవుని సేవ చేయగలం (కీర్తన 34:4; కీర్తన 119:50; అపో. 4:31).

దేవుడు మన నుండి ఆశించే విషయం దేవుని యందలి భయము, ఇది ఆత్మీయ సంబంధమైన విషయాలకు సంబంధించినది. ఇది దేవుని పట్ల గౌరవముతో కూడిన భయము (ద్వితీ. 10:12,13,20-22). దేవుడు మన యెడల గొప్ప కార్యములు చేసి, మనలను గొప్పగా ఆశీర్వదించాడు గనుక అయన మార్గములో నడవాలి, ఆయనను ప్రేమించాలి, ఆయనను సేవించాలి.

## దేవుని భయాన్ని ఎలా కలిగి ఉండాలి?

- మనకు ఇష్టము లేనప్పటికీ దేవుని చిత్తమును నెరవేర్చుట ద్వారా (ఆది. 22:12)
- శరీరాన్ని సంతోష పరచక దేవుని సంతోష పరచే విధంగా జీవించడం ద్వారా (ఆది. 39:9)
- పర్యావసానాలకు భయపడక దేవునితో సహవాసం చేసే జీవితం ద్వారా (దాని. 6:10)

## ముగింపు

దేవుని యందలి భయము మనలో నూతన క్రియలు జరిగేటట్లు, మన ద్వారా దేవుని కార్యాలు బయలుపడే విధంగా, మన బలహీనతలను బట్టి దేవుని వాత్సల్యం కొరకు ప్రార్థించే విధంగా మనలను ప్రోత్సహిస్తుంది (హబక్కూ. 3). దేవుని యందలి భయము వలన భూసంబంధమైన విషయాలను బట్టి గాక దేవుని బట్టి ఆనందిస్తూ, దేవునిపై విశ్వాసముతో ముందుకు సాగుతాము.

సాతానుడు కల్గించే భయం భౌతిక జీవితం మీద ప్రభావితం చూపిస్తుంది, కానీ దేవుని భయం భౌతిక, ఆధ్యాత్మిక జీవితాల మీద ప్రభావితం చూపిస్తుంది (మత్త. 10:28). మన జీవితంలో దేనికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాము? దేనిని ప్రోత్సహిస్తున్నాము?

– డా. జి. దేవిడ్ సుధాకర్, చీరాల

## కోశాధికారి లేఖ

# ప్రథమమైనవి, శ్రేష్ఠమైనవి ఇవ్వాలి

క్రీస్తునందు ప్రియమైన యుఇయస్ఐ-ఏపిలోని కోశాధికారులందరికి, సభ్యులకు
మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు నామములో శుభాకాంక్షలు.

"నీ రాబడి అంతటిలో ప్రథమ ఫలమును నీ ఆస్తిలో భాగమును ఇచ్చి యెహోవాను ఘనపరచుము. అప్పుడు నీ కొట్లలో ధాన్యము సమృద్ధిగా నుండును నీ గానుగలలో నుంచి క్రొత్త ద్రాక్షారసము పైకి పొరలి పారును". - సామె 3:9,10

నీ రాబడి అంతటిలో అంటే దేవుడు మనలను ఆశీర్వదించి మనకిచ్చిన సమృద్ధిలో నుంచి ప్రథమ ఫలము లేక ప్రథమ భాగములోని శ్రేష్ఠమైనవి ఆయనకు అర్పించడం ద్వారా ఆయనను ఘనపరచగలము. ద్వితీ 26:1-3 వచనాల్లో ఇశ్రాయేలీయులు అరణ్య మార్గములో ఉన్నప్పుడు వారు ఆకాశము నుంచి కురిసిన మన్నాను తిని బతికారు, అయితే వారు కనానులో స్థిరపడిన తర్వాత విత్తనాలు నాటి పంట పండించాలి. ఇదే వారి జీవనాధారమైనప్పుడు దేవుని దయకు కృతజ్ఞతగా తమ పంటల్లో ప్రథమ ఫలాన్ని, శ్రేష్ఠమైన వాటిని ఆయనకు అర్పిస్తూ వచ్చారు. మనం కూడా శ్రేష్ఠమైన విధానంలో దేవునికి అర్పిస్తూ వచ్చినప్పుడు వ్యక్తిగతంగా మన జీవితాల్లో, మన కుటుంబాల్లో సమృద్ధిని, సంతృప్తిని అనుభవించగలం. మన ఆదాయంలో ప్రథమ భాగం దేవునికి ఇవ్వడం చాలా శ్రేష్ఠమైన అంశం. మన పరిచర్య అవసరాలకు తగినట్లుగా ప్రార్థించి, ప్రభువు పనికి ఇచ్చి, ప్రభువిచ్చే దీవెనలు పొందుకొందాం.

ఆదికాండములో కయీను, హేబెలుల అర్పణ గమనించినప్పుడు కయీను కొంత భాగం ఇచ్చాడు కానీ హేబెలు తొలిచూలున పుట్టిన వాటిలో క్రొవ్విన వాటిని అంటే ప్రథమమైనవి, శ్రేష్ఠమైన భాగం ఇచ్చాడు. కావున మనమందరం కూడా ప్రథమమైనవి ప్రభువుకు ఇద్దాం. అలాగే విలువలు కలిగి జీవిస్తూ, విలువైన వాటిని అర్పిద్దాం.

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2023 తర్వాత పెరిగిన 17.95% బడ్జెట్‌కు అనుగుణంగా ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపేటట్లు
2. చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
3. యుఇయస్ఐ నేషనల్ వేతన సవరణలకు అనుగుణంగా మన స్టాఫ్‌కు కూడా వేతనాలు పెంచడానికి ఏసియం 2022 నిర్ణయించింది. దీని అవసరత ప్రతి నెల రూ. 70,000/- పెరుగుతుంది.
4. ఐదు ఫ్యామిలీస్ నేషనల్ స్టాఫ్ ట్రైనింగ్ కొరకు అవసరమైన 1 లక్ష కొరకు
5. యుఇయస్ఐ నేషనల్‌కు అనుగుణంగా ఏపి-స్టాఫ్‌కు క్రిస్మస్ గిఫ్ట్ కొరకు అవసరమైన రూ. 3.50 లక్షల కొరకు

**గమనిక:**
వచ్చే నెల నుంచి ట్రెజరర్ లెటర్ విద్యార్థి జ్వాలలో కాకుండా అవర్ ఫీల్డ్‌లో మాత్రమే వస్తుంది.

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు
యస్.ఆర్.డి. కిషోర్ కుమార్

**Minimum monthly need of UESI AP: Rs.12,00,000/- (as per the ACM 2023)**
**Minimum amount to be sent to UESI every month: Rs.4,50,000/-(as per the ACM'23)**
**Total average monthly need : Rs.18,37,000/- as per the Budget 2023**

## SEPTEMBER - 2023

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | --- | Field Staff Salaries | 5,25,903.00 |
| General Fund | 16,30,897.00 | Field Staff HRA, CA, MA & TA | 3,04,777.00 |
| Staff Support | 9,400.00 | Office Staff Salaries | 1,78,982.00 |
| | | UESI | 4,50,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Girls Depatment | 3,500.00 |
| | | To Gratuity | 50,000.00 |
| | | Other Expenditure | 42,796.00 |
| | | Transferred to SWF | 36,339.00 |
| **Total** | **16,40,297.00** | | **16,40,297.00** |

**Note:**
1. Projected Budget for the month of October'23 Rs. 18.37 Lakhs
2. Percentage of hike that all the EUs & EGFs are requested to do for their last years' monthly contribution: 17.95%

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-10-2023**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508




# భయమే అభయం

సహవాస కూడికల్లో
ప్రకాశించిన
నీ ధవళకాంతులు
లోకయానకంలో
ప్రయాణించగానే
విడిపోయినట్టు
ఒక్కొక్కరి దగ్గర ఒక్కోలా
మనసుకెన్ని రంగులో!

ఊసరవెల్లి అసూయపడేలా
ఊరంతా అచ్చెరువొందేలా
ఇంట్లో ఒకలా
బయట మరోలా
మోసం చేస్తున్నావో!
మోసపోతున్నావో!

అటూ ఇటూ చూసి
ఎవ్వరూ లేరని భ్రమసి
అపరాధాల మూటను
ఆనందంగా దాచుకొంటే
రహస్యాలన్నీ ఎరిగినవాడు
నిన్ను గద్దించడా?
నిను గద్దె దించడా?

కంటికి నచ్చినవన్నీ
కావాలనుకొంటూ
మంటి శరీరం మాట వింటూ
ఇంతే చాలని అనుకుంటే
అంతరంగం చూసేవాడు
ఈ రాత్రి నీ ప్రాణమడిగితే
విలాసాల్లో మునుగుతావో!
విలాపాల్లో మిగులుతావో!

విత్తిన పంట కోస్తామని తెలుసు
నిప్పుతో ఆటలు ముప్పని తెలుసు
గురివిందకు గురువులా
పైకి భక్తి కలిగి ఉంటే
దహించే అగ్ని ఉగ్రతలో
కాలిపోతావేమో!
ఖాళీ అయిపోతావేమో!

జ్ఞానానికి మూలం
వివేకానికి సూత్రం
దేవుని భయమే
లెక్క చెప్పాలనే
భయంతో జీవించు
భవిష్యత్తును ఆనందించు

– గొంగటి మేరిజాయ్, ఆదోని